
ముండ్లమూరు మండలం వేములబండ వద్ద నెర్రెలు ఇచ్చిన మాగాణి

ఉమ్మడి జిల్లాలోని సాగర్ ఆయకట్టు భూములకు నీటి గండం పొంచి ఉంది. పంట ఉత్పత్తులు చేతికి వస్తున్న ప్రస్తుత తరుణంలో మరో నెలన్నరపాటు పుష్కలంగా నీరు అవసరం ఉంది. ఆమేరకు సాగర్ నుంచి సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దాదాపు 2 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న వంటి పైర్లు కీలక దశలో ఉన్నాయి. అవి చేతికి రావాలంటే కనీసం 15 నుంచి 18 టీఎంసీల నీరు అవసరమని అంచనా. అయితే మార్చి ఆఖరులోపు అందులో సగం కూడా వస్తుందన్న గ్యారెంటీ కనిపించడం లేదు. అంతగా పొలాల్లో పైర్లు లేని వేళ గత సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు నీటిని ఇచ్చి ప్రస్తుతం అవసరమైన సమయంలో సరఫరాపై నియంత్రణ పెట్టారు. ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగానికి ముందుచూపు లేకపోవడం, అంతకు మించి రాష్ట్ర విభజన వల్ల సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో నీటి వాడకంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నిత్యం తలెత్తుతున్న వివాదాలు ప్రస్తుతం నీటి ఇక్కట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

సాగర్ ఆయకట్టుకు నీటి గండం

ఉమ్మడి జిల్లాలో 2లక్షల ఎకరాల్లో పైర్లు
కీలక దశలో వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న


కొర్రపాటివారిపాలెం వద్ద సాగర్ కాలువ పక్కనే ఉన్న పొలానికి నీరందక గడసబారిపోతున్న మిర్చి తోట

- మరో రెండు, మూడు తడులు తప్పనిసరి
- 15 టీఎంసీలకుపైగా నీరు అవసరం
- సగం కూడా ఇచ్చే అవకాశం లేని పరిస్థితి
- వర్షాల వేళ నీరిచ్చి ఇప్పుడు నియంత్రణ
- భారీగా నష్టపోనున్న రైతులు

ఇప్పటికే వాటా నీరు రాక..

అధికారవర్గాల సమాచారం ప్రకారం ఈ సీజన్‌లో సాగర్ ఆయకట్టులో 2.40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. అందులో 48 వేల ఎకరాల్లో మాగాణి కాగా, మరో లక్ష 92వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు ఉన్నాయి. ఆరుతడి పంటలలో అత్యధికంగా పొగాకు, మిర్చి, వైట్‌బర్లీ, మొక్కజొన్న వంటివి ఉన్నాయి. సాగర్ కుడి కాలువకు డ్యాం నుంచి 132 టీఎంసీల నీటి వాటా ఉండగా అందులో ఉమ్మడి జిల్లాకు 43శాతం వంతున 57 టీఎంసీలు సరఫరా కావాలి. ఆ ప్రకారం ఇప్పటికే 57 టీఎంసీల నీరు ఉమ్మడి జిల్లాకు వచ్చింది. అయితే పంటల సాగుకు నీరు అంతగా అవసరం లేని సెప్టెంబరు నుంచి నవంబరు వరకు అధికంగా నీరు సరఫరా చేశారు. అప్పట్లో శ్రీశైలం, సాగర్ డ్యాంలు నిండి గేట్లు ఎత్తి సముద్రానికి ఎక్కువగా నీటిని వదిలారు. ఆసమయంలో ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు స్థానికంగా పంటలకు నీరు అవసరం అంతగా లేకున్నా కాలువలకు నీరు ఇవ్వడంతో చెరువులు, కుంటలు, వాగుల్లో ప్రవాహం జోరుగా సాగింది.

ఒంగోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగు నీటి వనరు సాగర్ కుడి కాలువ. ఒంగోలు కేంద్రంగా ఉన్న జలవనరుల శాఖ సర్కిల్‌లో సుమారు 4.43 లక్షల ఎకరాల ఆయకట్టు ఎన్నెస్పీ పరిధిలో ఉంది. అందులో ప్రస్తుతం బాపట్ల జిల్లాలో లక్షా 72వేల ఎకరాలు ఉండగా మిగిలిన సుమారు 2.71 లక్షలు ప్రకాశం జిల్లాలో ఉంది. మొత్తం ఉమ్మడి జిల్లాలో 4.43 లక్షల ఎకరాలలో దీర్ఘకాలంగా నీరు అందని సుమారు లక్ష ఎకరాల చివరి భూముల రైతులు ఎప్పటి నుంచే సాగర్ నీరు ఆధారంగా పంటల సాగు మానేశారు. మిగిలిన 3.50 లక్షల ఎకరాలలో 45శాతం మాగాణి, 55శాతం ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడం, వరిసాగు అంత లాభసాటిగా లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది.

అందుబాటులో ఉంది 46టీఎంసీలే

గతంలో డ్యాంల గేట్లు ఎత్తి నీటిని వదిలే సమయంలో కాలువలకు విడుదల చేసే వాటిని రాష్ట్ర నీటి కోటా లెక్కల్లోకి తీసుకోకూడదన్న అనధికారిక ఒప్పందం రెండు రాష్ట్రాల మధ్య ఉండేది. అలాగే భావించి ఈ ఏడాది నీటిని సెప్టెంబరు సమయంలో ఇచ్చారు. అయితే ప్రస్తుతం సాగర్ డ్యాంలో నీటి నిల్వ తగ్గింది. ఇప్పుడు డ్యాంలో 178 టీఎంసీలు మాత్రమే ఉండగా డెడ్‌స్టోరేజీ 132 టీఎంసీలు పోను రెండు రాష్ట్రాల సాగునీటి అవసరాలకు కలిపి 46 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. దీనికి తోడు ఆంధ్ర రాష్ట్రం భారీగా సాగర్ నీటిని తోడేస్తున్నదని తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు అక్కడి ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. దీంతో నీటి వాడకం లెక్కలపై తెలంగాణ ప్రభుత్వం కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)పై ఒత్తిడి తెస్తోంది. దీంతో ఏపీకి అధికారికంగా 132 టీఎంసీలు వాడుకునే హక్కు ఉండగా ఇప్పటికే ఆ కోటా వాడినట్లు లెక్కలు కట్టారు. ఆ ప్రభావం ప్రస్తుత సీజన్‌లో పొలంలో ఉన్న పంటలకు తదుపరి నీటి సరఫరాపై తీవ్రంగా పడింది. కేఆర్ఎంబీపై తెలంగాణ ఒత్తిడితో

మిగతా 6వ పేజీలో



సాగర్ ఆయకట్టులో పంటలపై సీఈ సమీక్ష 6

- మార్చి ఆఖరు వరకు నీరు అవసరమని అధికారుల నివేదిక
- సరఫరాపై రేపటి కేఆర్ఎంబీ సమావేశం తర్వాత స్పష్టత


సంతనూతలపాడులో మహిళకు తడి, పొడి చెత్తను వేరుచేసే విధానాన్ని వివరిస్తున్న డీపీవో వెంకటనాయుడు

చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్

- పలు గ్రామాల్లో పర్యటించిన డీపీవో వెంకటనాయుడు
- తడి, పొడిచెత్త సేకరణపై గృహ యజమానులతో ముఖాముఖి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణపై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు పరిశీలించారు. సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఇంకోవైపు గృహ యజమానులను కలిసి తడి, పొడిచెత్తను వేరు చేసే విధానాన్ని వివరించారు. గృహాల నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకటనాయుడు సిబ్బందిని ఆదేశించారు. చెత్తను ప్రాసెస్ చేసి దాని విక్రయం ద్వారా వచ్చిన సంపద మొత్తాన్ని గ్రామపంచాయతీ ఖాతాకు జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కాగా ఆయా గ్రామాల్లో గృహ యజమానులతో ముఖాముఖి నిర్వహించారు. చెత్తను మీ ఇంటి వద్దకు వచ్చే కార్మికుల వాహనాల్లో వేయాలని సూచించారు. స్వచ్ఛభారత్- స్వర్ణాంధ్ర కరపత్రాలను గృహ యజమానులకు పంపిణీ చేశారు.

ఆగని అక్రమ వెంచర్లు

అధికారం మారినా కనిగిరిలో తగ్గని వైసీపీ నేతల హవా

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో షాడో ముసుగులో రాజకీయ పార్టీల నేతలు కూటమిగా మారారు. కూడబలుక్కొని అక్రమ వెంచర్లు వేస్తూ పబ్బం గడుపుకునేందుకు వైసీపీ నేతలు తిరిగి సిద్ధమయ్యారు. అధికారం మారినా వారి హవా ఏ మాత్రం తగ్గలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అసైన్డ్ భూములు, వాగులు, వంకలు, చెరువు అలుగులనూ వదలకుండా ఆక్రమించి వెంచర్లు వేశారు. అక్రమాలపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అనంతరం నామమాత్రపు నోటీసులు జారీచేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం కనిగిరి ప్రాంతంలో బైపాస్, గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వేమార్గం ఏర్పాటు పనులు ఊపందుకోవడంతో అక్రమార్కులు సరికొత్త పంథా అవలంబిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైసీపీ నేతలు ప్రస్తుతం స్థానిక ముఖ్యనేత ముక్కుసూటి వైఖరితో ఇరుకున పడ్డారు. తాజాగా రూటుమార్చి దొడ్డిదారిన అక్రమాలకు తెరలేపారు. అధికార పార్టీకి చెందిన కొందరిని అడ్డంపెట్టి వెనుకుండి పెట్టుబడి పెడుతూ అక్రమంగా వెంచర్లు వేస్తున్నారు. కనిగిరి మునిసిపాలిటీ పరిధిలోని పామూరు రోడ్డు హెరిటేజ్ ఎదురుగా మాజీ ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రం వెనుక ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తున్నారు. కందుకూరు రోడ్డులోని సెయింట్ జోసఫ్ స్కూలు వెనుక వైపున ప్లాన్ అప్రూవల్, కన్వర్షన్ లేకుండా వెంచర్లు వెలుస్తున్నాయి. కంభం రోడ్డులోని చెరువు కట్ట అలుగుకు తప్పుడు రికార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్ అయినట్లుగా హద్దులు చూపుతున్నారు. వీటిని అధికారులు అడ్డుకున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వెన్నెల అపార్ట్‌మెంట్ వెనుక వాగును పూడ్చేసి ఏకంగా ప్లాట్లు వేశారు. దీన్ని మూడు రోజుల క్రితం తహసీల్దార్ అడ్డుకున్నారు. దీంతోపాటు గతంలో అనుమతులు లేవని నిలిపివేసిన వెంచర్లనూ తిరిగి అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. అలాగే నియోజకవర్గంలోని పామూరులో అక్రమంగా వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చర్యలు

అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు వేస్తే వాటిని తొలగిస్తాం. అందుకు సంబంధించిన రియల్టర్లపై చర్యలు తీసుకుంటాం. కనిగిరి మండలంలో ఏ వెంచర్‌కూ అనుమతులు లేవు. అక్రమంగా వెంచర్లలో వేసిన ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు. అనుమతులు లేకుండా వెంచర్లు వేసిన వారికి నోటీసులు ఇస్తాం. నిర్ణీత గడువులోపు సమాధానం ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.
రవిశంకర్, తహసీల్దార్


కనిగిరిలోని పామూరు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రం వెనుక వెంచర్‌లో మట్టి క్యూరింగ్ కోసం ఉంచిన మునిసిపల్ ట్యాంకర్, అక్కడ ఉన్న హద్దురాళ్లు


ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా, పక్కన కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

భూ అక్రమాలపై ఉక్కుపాదం

చట్టానికి ఎవరూ అతీతం కాదు


- సిబ్బంది అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయాలి
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ అక్రమాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సీసీఎల్ఏ) ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఆర్డీవోలు, తహసీల్దార్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా గ్రీవెన్స్ కార్యక్రమాల్లో వచ్చిన రెవెన్యూ సంబంధ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆరా తీశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ వివరించారు. అనంతరం సిసోడియా మాట్లాడుతూ ఎన్నికలు, ప్రకృతి విపత్తుల సమయాల్లో రెవెన్యూ సిబ్బంది చిత్తశుద్ధి, అంకితభావంతో సమర్థవంతంగా పనిచేస్తారనే గుర్తింపు ఉందన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కూడా అదేవిధంగా పనిచేయాలన్నారు. శాఖ ప్రతిష్ఠ దెబ్బతినేలా ఎవరైనా ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రధానంగా గ్రీవెన్స్‌లో 60శాతం వరకు రెవెన్యూకు సంబంధించిన సమస్యలనే ప్రజలు ప్రస్తావిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. తమ స్థాయిలో

మిగతా 6వ పేజీలో

సిట్ దర్యాప్తును వేగవంతం చేయాలి

- సిసోడియా ఆదేశం
- వైసీపీ ప్రభుత్వ హయాంలోని భూదందాలపై ఆరా
- కేసులపై ప్రత్యేక సమీక్ష
- అగ్రహారం వద్ద జగనన్న లే అవుట్ పరిశీలన 7



ఏఎన్ఎంకు జీబీఎస్ లక్షణాలు

విజయవాడ ఆసుపత్రికి తరలింపు

వివరాలు మెయిన్‌లో..

సబ్సిడీ పథకాలను అర్హులకు అందించాలి

- జిల్లాలో ఆక్వా సాగును పెంచాలి
- మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్ 6

నేడు గ్రూపు-2 పరీక్ష

- ఒంగోలులోని ఏడు కేంద్రాల్లో నిర్వహణ 7
- కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు
- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రెండు హెల్ప్ డెస్క్‌లు
- హాజరుకానున్న 4,544 మంది అభ్యర్థులు





పొగాకు కొనుగోళ్లకు సన్నాహాలు

- వచ్చేనెల తొలివారంలో వేలం ప్రారంభించే అవకాశం
- 25న బోర్డు పాలకమండలి సమావేశంలో తుది నిర్ణయం
- దక్షిణాదిలో భారీగా పెరిగిన సాగు

ఒంగోలు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దక్షిణాది ప్రాంతంలో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లకు బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చేనెల తొలివారంలో వేలం కేంద్రాలను ప్రారంభించే అవకాశం ఉంది. ఈనెల 25న గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో జరుగనున్న పాలకమండలి సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ సీజన్‌లో రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాది ప్రాంతంలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. మరోవైపు రాష్ట్రంలో పొగాకు మార్కెట్‌కు దిక్సూచిగా ఉండే కర్ణాటకలో ధరలు బాగున్నా మార్కెట్ మందకొడిగా సాగుతోంది. ఇంకా దాదాపు 40శాతం వరకు పొగాకు అక్కడి రైతుల వద్దనే ఉంది. ఈ పరిస్థితులలో రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాది ప్రాంతాల్లోని వేలం కేంద్రాలలో త్వరితగతిన కొనుగోళ్లను చేపట్టాలని రైతుల నుంచి డిమాండ్ వస్తుండటంతో ఆ వైపు బోర్డు అధికారులు దృష్టి సారించారు.

అధికంగా సాగు, ఉత్పత్తి

ఒంగోలు కేంద్రంగా ఉన్న పొగాకు బోర్డు దక్షిణాది ప్రాంత రెండు రీజియన్ల పరిధిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రస్తుత సీజన్ (2024-25)కు సుమారు 64 వేల హెక్టార్లలో పంటసాగు, 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. అదే గతేడాది 59వేల హెక్టార్లలో సాగుకు, 89 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చారు. ఆ ప్రకారం గత ఏడాది కన్నా 5వేల హెక్టార్లలో సాగు విస్తీర్ణం, 16 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అధికంగా బోర్డు అనుమతి ఇచ్చింది. దీంతోపాటు ఈ సీజన్‌లో పంట సాగు విస్తీర్ణం

మిగతా 6వ పేజీలో



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్

సబ్సిడీ పథకాలను అర్హులకు అందించాలి

- జిల్లాలో ఆక్వా సాగును పెంచాలి
- మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం పెరిగేలా తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్ ఆదేశించారు. శనివారం ఒంగోలులోని మత్స్యశాఖ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆక్వా సాగు ఏ ప్రాంతంలో పెరిగే అవకాశం ఉందో గుర్తించి అక్కడి రైతులను తగినవిధంగా ప్రోత్సహించాలన్నారు. ఈక్రమంలో నాణ్యమైన సీడ్ అందేలా చూడాలని చెప్పారు. మత్స్యశాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాలను అర్హులకు అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీ యూనిట్లు అందించి వారి ద్వారా మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా పొదుపు సంఘాల మహిళలను భాగస్వాములను చేసి వారికి రుణాలను ఇప్పించటం ద్వారా వారి ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎస్టీలకు వ్యక్తిగతంగా ఇచ్చే రుణాలకు 90 శాతం సబ్సిడీ, సంఘాలకు ఇచ్చే రుణాలు నూరు శాతం సబ్సిడీతో అమలు చేయాలన్నారు. మత్స్యరంగంలో అసంఘిత కార్మికులు పని చేస్తున్నారని, వారి వివరాలను సేకరించి ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసి వారికి తగిన విధంగా ప్రయోజనం కలిగేలా చూడాలని చెప్పారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీలకు సంబంధిత కార్పొరేషన్లతో కలిసి సబ్సిడీ రుణాలను అందించే అవకాశం ఉందని, ఈ విషయంపై సమన్వయం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, ఎఫ్‌డీవోలు పాల్గొన్నారు.

భూ అక్రమాలపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

పరిష్కరించలేని సమస్యలైతే అదే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై తహసీల్దార్లకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలి

చట్టానికి ఎవరు అతీతులు కాదని, ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సిసోడియా ఆదేశించారు. కేవలం వీఆర్వో నివేదికపైనే ఆధారపడకుండా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు కూడా ఎప్పుడూ మండలకేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. సర్వే శాఖలో తగినంత సిబ్బంది ఉన్నందున విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 120 డ్రోన్ల ద్వారా రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. ప్రైవేటు భూములను 22(ఏ) జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేయడం తగదని హితవు పలికారు. ఇలాంటి భూముల కేసులను జిల్లా స్థాయి కమిటీలో చర్చించాలని సూచించారు. ప్రభుత్వ భూములు మాత్రం అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. గ్రామ స్థాయిలోని వీఆర్వోలు ఈవిషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కోర్టు కేసులు, లోక్ ఆదాలత్ కేసులను పర్యవేక్షిస్తూ సత్వరమే పరిష్కారానికి అవసరమైన పిటిషన్లు వేయాలని సిసోడియా ఆదేశించారు.

మార్చి మొదటివారం నాటికి పరిష్కరిస్తాం

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గ్రీవెన్స్ అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను మార్చి మొదటి వారం నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. సీసీఎల్ఏ ఆదేశాలు, సూచనల మేరకు రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, ఆర్డీవోలు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ బాషా, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, అసిస్టెంట్ ఫారెస్టు కన్జర్వేటర్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలి

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మంత్రి స్వామి ఆదేశం

కొండపి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నంకాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. అవసరమైన చోట్ల ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన శనివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించి పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. చేతిపంపులు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. రామతీర్థం ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాపై ఆరా తీశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రామతీర్థం నుంచి మరో ప్రాజెక్టు ద్వారా నీరందించేందుకు తయారు చేసిన డీపీఆర్ గురించి తెలుసుకున్నారు. నిధుల మంజూరుకు తాను కృషి చేస్తానని మంత్రి ఈసందర్భంగా వెల్లడించారు. తాగునీటి సమస్య ఉందని ఏగ్రామం నుంచి కూడా ఫిర్యాదు రాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేముల వేణుగోపాల్, ఆరు మండలాల ఏఈలు పి.కిషోర్ బాబు, పి.రమేష్‌బాబు, యు.జయపాల్, ఎం.పాల్‌రాజు, సిహెచ్.వెంకటేశ్వర్లు, ఎస్.మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు.



తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ప్రతిపాదనలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

బృందావన్‌గార్డెన్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.4లక్షల విలువైన సొత్తు అపహరణ
- సీసీపుటేజీలో ఇరువురు దుండగులు పాల్గొన్నట్లు గుర్తింపు

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): దుండగులు తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. రూ.4లక్షల విలువైన సొత్తును అపహరించుకెళ్లారు. ఈ సంఘటన ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని బృందావన్ గార్డెన్స్‌లో శనివారం తెల్లవారు జామున జరిగింది. వివరాలలోకి వెళితే.. మిట్నసల సుబ్బారావు సాంఘికసంక్షేమశాఖలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యి బృందావన్ గార్డెన్స్‌లో నివాసం ఉంటున్నారు. వారం క్రితం ఆయన హైదరాబాద్‌లోని తన కుమారుడు ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం పరిసరాలను శుభ్రం చేసేందుకు పనిమనిషి రాగా ఇంటి ముఖద్వారం గ్రిల్స్ ఊడదీసి ఉంది. అదేవిధంగా బెడ్‌రూం తాళం వేసి ఉండటంతో కిటికీ గ్రిల్స్ తీసి దుండగులు లోపలికి చొరబడి చోరీకి పాల్పడ్డారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న సుబ్బారావుకు సమాచారం ఇచ్చారు. శనివారం సాయంత్రం వచ్చి అన్ని పరిశీలించుకున్నారు. బీరవాలో ఉన్న నగదు, బంగారం సుమారుగా రూ.4లక్షలు విలువైన సొత్తును అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని తాలుకా పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేక్రమంలో అక్కడ లభ్యమైన సీసీపుటేజీ ఆధారంగా ఇరువురు దుండగులు దొంగతనంలో పాల్గొన్నట్లు స్థానికులు భావిస్తున్నారు. వేలిముద్రల నిపుణులు కొన్ని కీలకమైన ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది.



ఇంటి ప్రధాన ద్వారం వద్ద గ్రిల్స్‌ను తొలగించిన దుండగులు పక్కన ఇంట్లోచిందర వందరగా పడేసిన వస్తువులు

ఘనంగా చార్టర్డ్ అకౌంటెంట్స్ సంఘ ప్రమాణ స్వీకారం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఆర్‌సీ) ఒంగోలు బ్రాంచ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. స్థానిక మౌర్యా ఇన్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంఘ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్నకుమార్, సీసీఎం హైదరాబాద్ శ్రీధర్, చెన్నై ఎస్ఐఆర్‌సీ సెక్రటరీ ముప్పాళ్ల సుబ్బారావు, ఆర్‌సీఎం హైదరాబాద్ యర్ర తిరుపతయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయపు పన్నుశాఖలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుని ఖాతాదారులకు మెరుగైన సేవలను అందజేయాలన్నారు. అనంతరం ఒంగోలు బ్రాంచి అధ్యక్షుడిగా ఎన్నికైన చక్కా తిరువాయకుమార్, ఉపాధ్యక్షులు అద్దంకి సతీష్, కార్యదర్శి జె.యోగి రమణారెడ్డి, కోశాధికారి శంకర్ నరేంద్రకుమార్, సికాస చైర్మన్ ప్రేమ్‌కుమార్, మెంబర్‌గా కె.కిషోర్‌లతో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ కె.రాజేంద్రప్రసాద్ కొత్తగా ప్రవేశపెట్టబోతున్న ఆదాయపు పన్ను చట్టం-2025 గురించి వివరించారు. కార్యక్రమంలో మండవ విజయ్‌కుమార్, కూరపాటి సుబ్బారావు, ఆర్ఎల్ఎన్ రామ్‌ప్రసాద్, బైసాని జగన్మోహనరావు, మాదాల సత్యనారాయణ, రంగనాయకులు, శ్రీమన్నారాయణమూర్తి, బాల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్



భారీ సింహం బొమ్మ ఏర్పాటును పరిశీలిస్తున్న నగర కమిషనర్, సిబ్బంది

నగరానికి 'సింహ' స్వాగతం !

ఒంగోలు నగరాన్ని సుందరంగా తీర్చిదిదేల్లా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్‌క్యాప్ నిధులతో ఇప్పటికే నగరంలోని ప్రధాన రహదారుల మధ్య సెంటర్ డివైడర్ల మధ్య పచ్చని మొక్కలు, ఆకట్టుకునేలా గుర్రాలు, విద్యుదీప కాంతులతో అలంకరిస్తున్నారు. అందులో భాగంగా శనివారం భారీ సింహం బొమ్మను ఏర్పాటు చేశారు. దక్షిణ బైపాస్‌లోని నెల్లూరు, చెన్నై, బెంగళూరు, తిరుపతి వైపు నుంచి వచ్చేవారికి స్వాగతం పలికేలా సింహం బొమ్మ ఏర్పాటు చేయడం నగరవాసులను ఆకట్టుకుంటుంది. ఈ మేరకు పనులను కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఈ పద్మజ, పలువురు అధికారులు పరిశీలించారు

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నిధుల స్వాహాపై వివరణ కోరిన పీడీ

సింగరాయకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బింగినపల్లి గ్రామానికి చెందిన పొదుపు సంఘాల వీవోఏ జి.ఈశ్వరి సభ్యుల నుంచి సుమారు రూ.22 లక్షలు వసూలు చేసి బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేశారు. దీనిపై శనివారం ఆంధ్రజ్యోతిలో 'పొదుపు మహిళలకు వీవోఏ కుచ్చుటోపీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఆర్‌డీఏ పీడీ నారాయణ సింగరాయకొండ ఏపీఎం భాగ్యలక్ష్మిని వివరణ కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజి యాదవ్

గురుకుల పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

టంగుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న టంగుటూరులోని బీసీ గురుకుల పాఠశాల సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజియాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులంలో వంట మనుషులు చేయాల్సిన పనులను మధుమోహన్ అనే ఐదో తరగతి విద్యార్థితో చేయించడం వల్లనే అతనిపై పాలు పడి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. వెంటనే మంత్రి స్వామి స్పందించి మధుమోహన్‌ను ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, స్టాలిన్ పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లకు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

భారీగా పెరిగింది. పంట ఉత్పత్తి కూడా అదేస్థాయిలో అధికంగా వచ్చింది. బోర్డు అధికార వర్గాల అంచనా ప్రకారం దక్షిణాదిలో ప్రస్తుత సీజన్‌లో సుమారు 89 వేల హెక్టార్లలో పంట సాగు కాగా దాదాపు 161 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి కానుందని అంచనా. అంటే పొగాకు బోర్డు అనుమతించిన దానికన్నా సుమారు 25వేల హెక్టార్లలో అధికంగా సాగు జరగ్గా 56 మిలియన్ కిలోలు అధికంగా పంట ఉత్పత్తి రానుంది. ఈ పంట మొత్తం అమ్మకాలు జరగాలంటే దాదాపు ఏడెనిమిది నెలలు పట్టే అవకాశం ఉంది.

వేలంను త్వరగా ప్రారంభించాలి

కర్ణాటకలో ప్రస్తుత సీజన్‌లో 100 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా కాగా ఇప్పటివరకు 60 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు జరిగింది. గరిష్ఠ ధర కిలో రూ.337 పలుకుతున్న మార్కెట్ మాత్రం స్పీడ్‌గా లేదు. ఈ పరిస్థితులలో రాష్ట్రంలో వీలైనంత త్వరగా కొనుగోళ్లు ప్రారంభిస్తేనే ఈ ఏడాది చివరి వరకు వేలం ప్రక్రియ కొనసాగుతుంది. ఇదేవిషయాన్ని పలువురు రైతు ప్రతినిధులు బోర్డు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు దాదాపు ఎనిమిదేళ్ల నుంచి బోర్డు ఈడీగా కొనసాగుతున్న అద్దంకి శ్రీధర్‌బాబు మార్చి 11న ఆ బాధ్యతల నుంచి నిష్క్రమించనున్నారు. ఆతర్వాత సీజన్ కొనుగోళ్లను ప్రారంభించాలన్న ఆలోచన కూడా అటు అధికారులు, ఇటు రైతు ప్రతినిధులు నుంచి వచ్చింది. దీంతో వచ్చే నెల తొలివారంలో వేలంకేంద్రాలు ప్రారంభించడం మంచిదన్న అభిప్రాయం ఎక్కువమంది వ్యక్తం చేస్తుండటంతో బోర్డు అధికారులు కూడా అదే ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొనుగోళ్లకు ముహూర్తం ఖరారు ప్రధాన అజెండాగా ఈనెల 25న పొగాకు బోర్డు సమావేశం గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో జరుగనుంది.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సొసైటీ ఫర్ ఎంప్లామెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడప్) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో జరిగే జాబ్ మేళాలను జిల్లాలలోని మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ధనలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 28న, మార్చి నెల 4,14,18,28 తేదీల్లో జాబ్ మేళాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జరుగుతాయన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రిష్టియన్, సిక్, బౌద్ధ, జైన యువత సీడప్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాతో పాటు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వివరాలకు 9849901157, 9951160149 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సహకార సంఘ ఉద్యోగి ఆత్మహత్య

అద్దంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ సొసైటీ లో ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడ్డారు. అద్దంకి పట్టణంలోని అభ్యుదయనగర్‌లో నివాసం ఉండే సహకారం సంఘం ఉద్యోగి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసి బంధువులు వైద్యశాలకు తీసుకు వెళ్లగా మృతి చెందారు.

సమస్యల పరిష్కారంలో సమన్వయంతో సాగండి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సిబ్బందితో కలిసి సమన్వయంతో సాగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం మునిసిపల్ సమాశం హాలులో నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి నిరంతరం శ్రమించాలని సూచించారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సేవలందించాలన్నారు. అనంతరం అధికారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. దీంతో అర్జీదారులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఎమ్మెల్యే వారి నుంచి అర్జీలు స్వీకరించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సాగర్ ఆయకట్టుకు నీటిగండం

(5వ పేజీ తరువాయి)

మన రాష్ట్రానికి ఇక పెద్దగా సాగర్ నీరు సరఫరా కాకపోవచ్చన్న సంకేతాలు ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఇరిగేషన్ అధికారులకు అందాయి. మార్చి ఆఖరు వరకు అతి తక్కువ నీరు మాత్రమే వస్తుందని, అందుకనుగుణంగా నియంత్రణ చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలు అందాయి. దీంతో ఆ ప్రకారం కసరత్తును ప్రస్తుతం ఇక్కడి అధికారులు చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పొలంలో ఉన్న పంటల నీటి అవసరాలను పరిశీలిస్తే.. ఉమ్మడి జిల్లాకు మార్చి ఆఖరులోపు కనీసం 15నుంచి 18 టీఎంసీల నీరు అవసరం. అయితే అందులో సగానికి మించి వచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈఏడాది జిల్లాలో ప్రత్యేకించి రామతీర్థం దిగువ ప్రాంతంలోని ఎస్ఎన్‌పాడు, కొండపి, ఒంగోలు, దర్శి నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 50వేల ఎకరాల్లో పొగాకు లేత తోటలు ఉన్నాయి. వాటికి కనీసం మూడు తడుల నీరు అవసరం ఉంది.

వారబందీ అమలుకు ఆదేశం

రామతీర్థం నుంచి దర్శితోపాటు వైపాలెం నియోజకవర్గాలలోని పలు గ్రామాల్లో మిర్చి, వరి, మొక్కజొన్న ఉండగా బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో మిర్చి, మొక్కజొన్న, బర్లీ పొగాకు అధికంగా ఉంది. వీటన్నింటికీ దాదాపు రెండు మాసాలు నీరు అవసరం. పలుచోట్ల శనగ పంటకు కూడా తడులు అందించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఆ ప్రకారం 15 నుంచి 18 టీఎంసీల నీరు అవసరం కనిపిస్తుండగా 8 టీఎంసీలు మించి ఇచ్చే అవకాశం లేదన్న సంకేతాలు ఉన్నత స్థాయి నుంచి జిల్లా అధికారులకు అందాయి. ఆ మేరకు వారబందీ అమలు, ఇతర నీటి నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఏమి చేయాలన్నది అర్థంకాక ఇక్కడ ఇరిగేషన్ అధికారులు తలల పట్టుకుంటున్నారు. నీటి నియంత్రణపై ఇప్పటికే కలెక్టర్ అన్సారియా రెండు రోజుల క్రితం సమీక్ష చేయగా శనివారం ప్రాజెక్టుల సీఈ జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. అయితే అవసరానికి సరిపడా నీరు సరఫరా అవకాశం మాత్రం కనిపించడం లేదు. ఏదైనా అకాల వర్షం పడితే తప్ప రైతులకు నీటిగండం తప్పేటట్లు లేదు.



చుక్కనీరు లేకుండా చిల్లచెట్లతో నిండి ఉన్న రజానగరం మేజర్ కాలువలు

సాగర్ ఆయకట్టులో పంటలపై సీఈ సమీక్ష

- మార్చి ఆఖరు వరకు నీరు అవసరమని అధికారుల నివేదిక
- సరఫరాపై రేపటి కేఆర్ఎంబీ సమావేశం తర్వాత స్పష్టత

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సాగర్ ఆయకట్టులో ఉన్న పైర్ల పరిస్థితి, నీటి అవసరాలపై ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్(సీఈ) బి. శ్యాంబాబు జిల్లా ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. స్థానిక ప్రాజెక్టుల సీఈ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఈ బాలమురళీకృష్ణ, ఎస్ఈ వరలక్ష్మీ, డిప్యూటీ ఎస్ఈ రామకృష్ణలతోపాటు పలు ప్రాంతాల ఈఈలు పాల్గొన్నారు. ఒంగోలు సర్కిల్ పరిధిలో ఉన్న ఉమ్మడి జిల్లాలోని ఆయకట్టులో పంటల సాగు, ఇంకా నీటి అవసరం తదితర అంశాలపై మాట్లాడారు. ఇంకా రెండు లక్షల ఎకరాల వరకు పైర్లు పొలంలో ఉండగా మార్చి ఆఖరు వరకు 15 టీఎంసీలు అవసరమని చెప్పారు. కనీసం 9.50 టీఎంసీలు అయినా ఇవ్వాలని జిల్లా అధికారులు ఆ సమావేశంలో నివేదించారు. అయితే ఆ మేర నీటి సరఫరాకు అవకాశం లేదన్న సంకేతాలు ఉన్నత స్థాయి నుంచి ఉన్నట్లు సీఈ చెప్పారు. ఈనెల 24న మరోసారి రెండు రాష్ట్రాల అధికారులతో కేఆర్ఎంబీ సమావేశం ఉందని, ఆతర్వాత స్పష్టత వస్తుందని వెల్లడించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ వివాదం ముదరకముందే మార్చి ఆఖరులోపు రాష్ట్రానికి మరో 28 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర అధికారులు అంచనా వేసి స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల మధ్య సర్దుబాటు చేసుకుని వాడుకోవాలని రెండు రోజుల క్రితం సూచించారు. ఆ విషయంలో ఎగువనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ 20 టీఎంసీలు వాడుకునేలా వారబందీ అమలు చేపట్టి పక్షంరోజుల్లో 9 టీఎంసీలు ఉమ్మడి గుంటూరు, ఆరు రోజులు ఉమ్మడి ప్రకాశానికి నీరు ఇచ్చేలా షెడ్యూల్ రూపొందించారని తెలిసింది. దానిని జిల్లా అధికారులు వ్యతిరేకిస్తూ త్రిపురాంతకం సమీపంలోని 85/3 వద్ద నిరంతరం 2వేల క్యూసెక్కుల సరఫరా చేయాలని ఏబీసీ మీద వారబందీకి అభ్యంతరం లేదని చెప్పినట్లు తెలిసింది. అయితే మొత్తం వ్యవహారంపై కేఆర్ఎంబీ సోమవారం నిర్వహించే సమావేశంలో స్పష్టత రానున్నట్లు సమాచారం.



ఆయకట్టులోని పంటలస్థితిపై సమీక్షిస్తున్న సీఈ శ్యాంబాబు

నేడు గ్రూపు-2 పరీక్ష

ఒంగోలులో ఏడు కేంద్రాలు
కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు
పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రెండు హెల్ప్ డెస్క్‌లు
పరీక్షకు 4,544 మంది హాజరు
పరీక్షల కో ఆర్డినేటర్‌గా జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్‌సీ నిర్వహించే గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ పరీక్షలు ఆదివారం రెండు సెషన్లలో జరగనుండగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4,544 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం సెషన్ 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుంది. 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా హాలులోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం పరీక్ష 3 గంటలకు ప్రారంభం కానుండగా 1.30నుంచి 2.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షకు అనుమతించనున్నారు. ఈ పరీక్షలకు 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌కు అవకాశాన్ని కల్పించారు. పరీక్షకు 15 నిమిషాల ముందు తర్వాత అభ్యర్థులను పరీక్షా హాలులోకి అనుమతించరు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కో ఆర్డినేటర్‌గా నియమించారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా స్థాయి అధికారులు ఏడుగురిని లైజనింగ్ అధికారులుగా నియమించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. అభ్యర్థులు అటువంటి వస్తువులను బయటనే పెట్టి పరీక్షకు హాజరయ్యే విధంగా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే అనుమతి ఇస్తారు. దివ్యాంగులు, గర్భిణిలు ఉంటే ఆయా పరీక్షా కేంద్రాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసే విధంగా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు అనుచితంగా ప్రవర్తిస్తే డీబార్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. పరీక్షల నిర్వహణ కోసం కలెక్టరేట్‌లో 8801188046 నెంబరుతో కంట్రోలు రూమును ఏర్పాటు చేశారు. మరో వైపు పోలీస్ శాఖ ద్వారా అభ్యర్థులు సకాలంలో చేరేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ వద్ద హెల్ప్ డెస్క్‌తో పాటు పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగిసేంత వరకు నిఘా నీడలో గ్రూపు-2 పరీక్షలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంది.

పరీక్షా కేంద్రాలు	రాసే అభ్యర్థులు
క్విస్‌కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్	944
నాగార్జున డిగ్రీ కళాశాల	600
శ్రీ హర్షిణీ డిగ్రీ అండ్‌పీజీ కాలేజీ	600
రైజ్‌కృష్ణసాయి ప్రకాశం గ్రూపు ఇన్‌స్టిట్యూట్	600
రైజ్ కృష్ణసాయి గాంధీగ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్	600
పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్	600
పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్	600



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఎల్ఏ సిసోడియా, పక్కన కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఎస్పీ దామోదర్

సిట్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- సీసీఎల్ఏ సిసోడియా ఆదేశం
- వైసీపీ ప్రభుత్వ హయాంలోని భూదందాలపై ఆరా
- కేసులపై ప్రత్యేక సమీక్ష

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): సిట్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సీసీఎల్ఏ సిసోడియా ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం హయంలో జరిగిన భూదందాలపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సీసీఎల్ఏ) ఆర్‌పీ.సిసోడియా శనివారం స్థానిక ప్రకాశంభవన్‌లో సమీక్ష నిర్వహించారు. భూదందాలపై నమోదు అయిన కేసుల దర్యాప్తు వేగవతం చేయాలని చెప్పారు. అదేవిధంగా నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ జరిగిన 51 డాక్యుమెంట్లు రద్దు చేయాలని కోరారు. అయితే సమావేశంలో పాల్గొన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు సమాధానం ఇస్తూ నిబంధనల ప్రకారం అలా చేయడం కుదరని, కోర్టు ద్వారానే రిజిస్ట్రేషన్లు రద్దు చేయించుకోవాలని సమాధానం ఇచ్చారు. భూదందాలపై ఏర్పడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నమోదు చేసిన కేసులు 112 ఉండగా, వాటి దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. సిట్ పరిధిలోనికి రాని కేసులను తొలగించాలని, భూదందాలకు సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు తయారీ, అందుకు గల ఆధారాలను సేకరించాలని ఆయన ఆదేశించారు. నకిలీ రిజిస్ట్రేషన్లు కేసులలో నిజమైన యజమానులను గుర్తించాలని సూచించారు. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఇతర పత్రాలను పరిశీలించి స్థలాలు, వ్యవసాయభూములకు వాస్తవమైన యజమానులను గుర్తించాలని కోరారు. కేసుల దర్యాప్తులో మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్‌శాఖ, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీసులకు అవసరమైన సమాచారం వెంటనే సిబంధిత శాఖలనుంచి ఇవ్వాలన్నారు. అదేవిధంగా కేసులు దర్యాప్తు వేగవతం చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ 15 రోజుల్లో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్పీ ఏఆర్.దామోదర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌ను పరిశీలించిన సిసోడియా

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని ఎన్. అగ్రహారం వద్ద గత వైసీపీ ప్రభుత్వంలో వేసిన జగనన్న లే అవుట్‌ను రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం ఆ లేవుట్‌ను పరిశీలించి వివరాలను జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో అక్కడ కొనుగోలు చేసిన భూముల వివరాలు, లబ్ధిదారుల వివరాలను జేసీ గోపాలకృష్ణ సీసీఎల్ఏకు వివరించారు. ఈ సందర్భంగా లేఅవుట్‌పై జేసీకి పలు సూచనలు చేశారు. అర్హులు ఎంతమంది ఉన్నారు, డబుల్ ఎంట్రీలు ఎంత మంది ఉన్నారో గుర్తించాలని సూచించారు. అనంతరం లే అవుట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నతో పాటు రెవెన్యూ అధికారులు ఉన్నారు.



ఎన్. అగ్రహారం వద్ద జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సిసోడియా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు, పక్కన ఎస్ఐ మహేష్

శ్రీశైలం వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

మార్కాపురం డీఎస్పీ నాగరాజు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి22(ఆంధ్ర జ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కాపురం డీఎస్పీ యూ.నాగరాజు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషనులో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి కొలువైన శ్రీశైల క్షేత్రానికి బ్రహ్మోత్సవాలకు దేశం నలుమూలల నుంచి వేల సంఖ్యల్లో భక్తులు వస్తారన్నారు. వారు ప్రశాంతమైన వాతావరణంలో దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి క్షేమంగా వెళ్లాల్సిన క్రమంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటే ప్రయాణం సాఫీగా జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ నుంచే రెండు, మూడు చక్రాల వాహనాలను దోర్నాలలోనే నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. అంతేగాక శ్రీశైలంలో రద్దీని బట్టీ నాలుగు చక్రాల వాహనాలను కూడా దోర్నాల లోనే నిలిపి వేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దారవీడు మండలం కుంట వద్దనే భారీ వాహనాలను దోర్నాల వైపు రాకుండా దారి మళ్లించి గిద్దలూరు వైపుగా కర్నూలుకు వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 10 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. ఆయా సెక్టార్ల పరిధిలో పోలీసు సిబ్బందిని మొబైల్ బృందాలుగా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా అనుకోని ఘటనలు జరిగినప్పుడు వాహనాల తొలగింపు కోసం 3 ఎక్స్‌కవేటర్లు, ఐదుగురు మెకానిక్‌లను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ ఏర్పాట్లన్నీ సవ్యంగా జరిగేందుకు డీఎస్పీతో పాటు, నలుగురు సీఐలు, 9 మంది ఎస్సైలు, 250 మంది పోలీసు సిబ్బందితో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితులు అవగాహన చేసుకుని ప్రజలు, భక్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వీ.మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రేణుకమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పంగులూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పంగులూరులో ఆదివారం శ్రీ రేణుకమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగనుంది. రాయిణి వంశస్థులు తమ ఇలవేల్పుగా భావించే వంశదేవర శ్రీ రేణుకమ్మ అమ్మవారు కొలువు దీరేందుకు గ్రామంలో రూ.60లక్షలతో సుందరంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో 23వ తేదీ ఉదయం 10 గంటల 23 నిమిషాలకు శ్రీ రేణుకమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలు, శిఖర ప్రతిష్ఠ ప్రముఖ వేద పండితులు వేముల శ్రీహరిచౌదరి నిర్వహించనున్నారు.



రేణుకమ్మవారికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గరటయ్య



రేణుకమ్మ తల్లి అమ్మవారికి జలాభిషేకానికి బిందెలతో నీటిని తీసుకువస్తున్న రాయిణి వంశానికి చెందిన మహిళలు

శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు

రేణుకమ్మ అమ్మవారి ప్రతిష్ఠ సందర్భంగా శనివారం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య పాల్గొని అమ్మవారికి పాలాభిషేకం చేశారు. ఉదయం అనుష్ఠానం, హోమం, పంచామృతం, పంచగవ్య, ద్వాత్రింశ ఓషధీ స్నపన, క్షీరాధివాసం, అధివాస హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో కనులపండువుగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం భారీ అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మార్కాపురం నుంచి ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ నరసింహులు

- డిపో మేనేజర్ నరసింహులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ ఉదయం నుంచే మార్కాపురం రైల్వేస్టేషన్ నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. శ్రీశైలానికి ప్రత్యేకంగా 80 బస్సులు అందుబాటులో ఉండనున్నాయన్నారు. దోర్నాల నుంచి ప్రత్యేకంగా 4 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మార్కాపురం మీదుగా మొత్తం 195 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాలైన తర్లుపాడు, కంభం, త్రిపురాంతకం, యర్రగొండపాలెం నుంచి వేకువజాము నుంచే శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. త్రిపురాంతకానికి 6 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మార్కాపురం నుంచి త్రిపురాంతకం 2, వై.పాలెం నుంచి త్రిపురాంతకం 2, త్రిపురాంతకం నుంచి ఆలయానికి 2 బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ. పక్కన సీఐ రామారావు, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది

ముండ్లమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండలంలోని ఈదర గ్రామానికి చెందిన జడ లక్ష్మీనారాయణ, మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన జడ శ్రీహరి, మొగిలివంశీ, సంపత్ నగర్‌కు చెందిన ఉప్పు శివగోపి కొంతకాలంగా పలు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ వై.నాగరాజులకు అందిన సమాచారంతో వారి కదలికలపై నిఘా పెట్టారు. మార్టూరు నుంచి గంజాయితో మండలంలోని వేంపాడు జంక్షన్‌కు వస్తుండగా ఎస్ఐ నాగరాజు, సిబ్బంది అదుపులోకి తీసుకొన్నారు. వారివద్ద ఉన్న నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని శనివారం రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. వీరు గత కొంతకాలంగా సామర్లకోటకు చెందిన ఒక వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలుచేసి బాపట్ల జిల్లాలోని మార్టూరు, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారికి తెలిసిన వ్యక్తుల ద్వారా విక్రయిస్తున్నట్లు చెప్పారు. వీరిపై గతంలో మార్టూరు, చీరాల వన్‌టౌన్, నరసరావుపేట - 2 టౌన్ పోలీసు స్టేషన్‌ల లో కేసులు నమోదయ్యాయి. ఈసందర్భంగా సీఐ రామారావు, ఎస్ఐ నాగరాజును, హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ మహేష్, హోంగార్డు ఖాశిం, తదితరులును ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించి రికార్డులు ప్రకటించినట్టు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఎయిడెడ్ మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మిగులుగా తేలిన ఎయిడెడ్ టీచర్లను అవసరమున్న ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ తెలిపారు. టీచర్ పోస్టులు భర్తీకి అనుమతి ఇమ్మని కోరుతూ 13 ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో ఆ 13 పాఠశాలలకు 39 మంది మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తున్నారు. పిల్లలు లేని పాఠశాలల్లో పనిచేస్తున్న మిగులు టీచర్లకు ప్రాధాన్యం ఇచ్చి వారిని హైకోర్టును అశ్రయించిన పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో మిగులు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తవుతుందని డీఈవో తెలిపారు. అయితే మిగులు టీచర్లను ఎయిడెడ్‌పాఠశాలలకు సర్దుబాటు చేయకుండా వారి సీనియారిటీ జాబితాను తయారు చేసి కౌన్సెలింగ్ విధానంలో వారిని ప్రభుత్వపాఠశాలల్లో ఖాళీలకు సర్దుబాటు చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు కోరారు.

రేపు పీఎం కిసాన్ ఆర్థిక సహాయం విడుదల

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పెట్టుబడి, ఆర్థిక సాయంతో పాటు వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధులు సోమవారం బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈపథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించగా ఈనెల 22న(సోమవారం) ప్రధానమంత్రి నరేంద్రమోదీ బిహార్‌లోని భాగల్పూర్ వేదికలో ఒక్కొక్క రైతుకు రూ.2వేల చొప్పున రైతులఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఈ విడత జిల్లాలో 2.48 లక్షల మంది రైతులకు రూ.49.51 కోట్లు నేరుగా జమ చేస్తారన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయశాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం ప్రతి రైతు సేవా కేంద్రంలో రైతులు వీక్షించేందుకు స్క్రీన్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

సమీపిస్తున్న గడువు..
వేగంగా పడాలి అడుగు !

రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు నెలాఖరు వరకే అవకాశం
ఎస్‌ఎన్‌పాడు మండలంలో 60 శాతమే..
గ్రామాల్లో రాత్రిళ్లు కూడా పేర్లు రిజిస్టర్ చేస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య(ఫార్మర్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియను చేపట్టింది. అసైన్‌మెంట్ భూములు మినహా సాగుభూమి ఉన్న ప్రతిరైతుకు 11 అంకెల సంఖ్యను జారీ చేస్తున్నారు. పీఎం కిసాన్‌తో పాటు వివిధ పథకాల అమలుకు ఇది ప్రామాణికం కానుంది. సంతనూతలపాడు మండలంలో 7,150 మంది రైతులు ఉండగా శనివారం రాత్రి వరకు 4,436 మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటివరకు కేవలం 60శాతం మాత్రమే నమోదు జరిగింది. ఇంకా 2,714 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. గడువు ఇక ఆరు రోజులు మాత్రమే ఉండటంతో రైతులు ముందుకు రావాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

రైతు సేవా కేంద్రాల్లో..

విశిష్ట గుర్తింపు సంఖ్య వివరాల నమోదు ప్రక్రియను రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు చేపడుతున్నారు. సొంతభూమి కలిగిన వారు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీ లేదా 1బి, ఆధార్‌తో పాటు అనుసంధానం చేసిన మొబైల్ నెంబరు వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది.

నెలాఖరు వరకే..

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెలాఖరు నాటికి పూర్తిచేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. గ్రామ వ్యవసాయ సహాయకులు రోజుకు 25 మందికి తగ్గకుండా వివరాలు నమోదు చేయించాలని సూచించారు. ఈ-పంట నమోదుకు కౌలు రైతు వివరాలు నమోదు చేసుకోవచ్చు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదులో మాత్రం విధిగా భూయజమాని వివరాలు ఉండాలి. భూయజమానులు స్థానికంగా లేకపోవడం ఒక సమస్య అయితే రిజిస్ట్రేషన్ సమయంలో సర్వర్ సరిగా రాక నమోదు ఆలస్యమవుతోంది. క్షేత్రస్థాయిలో వివిధ పనుల్లో ఉన్న భూయజమానులు రైతు సేవాకేంద్రాలకు వెళ్లలేకపోతే ఓటీపీ ఆధారంగా నమోదు చేసుకోవచ్చు. సాగుభూమి ఉన్న ప్రతిరైతు వివరాల నమోదుకు ముందుకు రావాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపచేసేందుకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రాత్రి 10 గంటల వరకు కూడా వ్యవసాయాధికారులు, సిబ్బంది గ్రామాల్లో ఉండి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతున్నారు. రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరుతున్నారు.


ఎస్‌ఎన్‌పాడులో రాత్రి 9-30 గంటల సమయంలో రిజిస్ట్రేషన్ ప్రకియ చేస్తున్న అధికారులు

నెల్లూరు జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోని కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో శనివారం సీసీఎల్ఏ సిసోడియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. రామదూత ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకోకుండా ఆన్‌లైన్ పేరుతో ఆ భూములను అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

ఘనంగా ఉప్పుగుండూరు కళాశాల వార్షికోత్సవం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 41వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా ఆర్ఐవో సైమన్‌విక్టర్, డీఐఈవో ఐ.శ్రీనివాసరావు హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రులకు, గ్రామానికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. తొలుత కళాశాల స్థల దాత అమరా కృష్ణమూర్తి చిత్రపటానికి ఆయన కుమారుడు రాఘవేంద్రరావుతో కలిసి పూలమాలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజ్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తె విద్యుల్లత కళాశాలకు 10 కుర్చీలను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగనాయకులు, సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ మున్నంగి వెంకటరావు, మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్‌బాబు, తెలగతోటి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ


శంకర్‌ను పరామర్శిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

సింగరాయకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త జమ్ము మస్తాన్‌రావు (68) బుధవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య శనివారం మస్తాన్‌రావు స్వగృహానికి వెళ్లి ఆయన కుమారుడైన టీడీపీ నేత జమ్ము శంకర్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్య వెంట టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు తదితరులు ఉన్నారు.

ఏపీయూడబ్ల్యూజే డైరీల అందజేత


సీసీఎల్ఏ సిసోడియా, కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణకు డైరీలను అందజేసిన యూనియన్ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర డైరీలను యూనియన్ బాధ్యులు జిల్లా అధికారులకు అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ.రమణ, దాసరి కనకయ్యల ఆధ్వర్యంలో రెవెన్యూశాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్నలకు అందజేశారు. అలాగే ఎస్పీ దామోదర్‌కు డైరీలను అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుపై హర్షం

సింగరాయకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టును ఏర్పాటు చేయడంపై టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కోర్టు పరిధిలోకి సింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు, కొండపి పొన్నలూరు మండలాలను చేర్చడం శుభపరిణామమన్నారు. కొండపి నియోజకవర్గంలోని కక్షిదారులు, న్యాయవాదులకు సింగరాయకొండలో కోర్టు అనువుగా ఉంటుందని వివరించారు. కోర్టు ఏర్పాటుకు కృషిచేసిన హైకోర్టు న్యాయమూర్తి కుంభజడల మన్మథరావుకు, జిల్లా న్యాయాధికారికి న్యాయవాదుల తరఫున శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా క్రీడాదినోత్సవం


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట సుబ్బయ్య హైస్కూల్లో మాస్టర్ బీవీసుబ్బయ్య 103వ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి క్రీడాదినోత్సవం, పదో వతరగతి విద్యార్థుల వీడ్కోలు సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వేశ్వరయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ బి.రవిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. హైస్కూల్ పూర్వవిద్యార్థి, రిటైర్డ్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలకు చేరుకోవాలని తెలిపారు. పాఠశాల సలహాదారు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌కు బానిస అవుతున్నారని, పుస్తకం పఠనం అలవాటు చేసుకుంటే మంచిదన్నారు. అనంతరం పదో తరగతి ప్రీపబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. హెచ్ఎం వేణుగోపాలరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాయర్‌పేటలోని శ్రీ చైతన్య స్కూలు సీ బ్యాచ్, ఐకాన్ బ్రాంచ్‌లో శనివారం తల్లిదండ్రులకు విద్యార్థులకు పాదపూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణశిరీష మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా విద్యలో ముందుకు సాగాలన్నారు. చదువుతో పాటు తల్లిదండ్రులను కూడా గౌరవించాలని, కుటుంబం ప్రాముఖ్యతను, వారి కష్టనష్టాలను తెలుసుకుంటూ ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచి డీన్ వై.శ్రీనివాసరావు, రీజనల్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, సమన్వయకర్త జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగమేశ్వరం వద్ద శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పండుగ సందర్భంగా చెన్నిపాడు సమీపంలోని సంగమేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆలయ ఈవో బైరాగిచౌదరి, ఎస్సై అనూక్ శనివారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, ఆలయం లోపలికి వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, క్యూలైన్ల ఏర్పాట్లపై చర్చించారు. తాగునీరు, ప్రాథమిక వైద్యం తదితర అంశాలపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

● ఎంపీపీ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

మర్రిపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి సూచించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్అండ్‌బీ అధికారులు మర్రిపూడి-పొదిలి రహదారికి సత్వరమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. ధర్మవరం సర్పంచ్ రమణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో డీప్ బోరు పనిచేయకపోవడంతో నెల రోజులుగా నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూచిపూడి బీసీ కాలనీలో రూ.16 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంటింటికీ కొళాయి పథకం నిరుపయోగంగా మారిందని సర్పంచ్ కోటమ్మ అన్నారు. త్రీఫేస్ మోటారు బిగించకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలిపారు. వెంటనే నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ కోరారు. మర్రిపూడి, చిమట, కాకర్ల, గుండ్లసముద్రం గ్రామాలలో రక్షిత నీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరాయని, తక్షణమే వాటిని కూల్చివేసి కొత్తవి నిర్మించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. రామతీర్థం జలాశయం నుంచి సరఫరా అయ్యే రక్షిత నీటిని క్లోరినేషన్ చేయించాలని పలువురు సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.జగదీష్, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఏఈ జయపాల్, ఎంపీటీసీ సభ్యులు శ్రావణి, మాధవి, సర్పంచులు భాస్కర్, మరియబాబు, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

● 46.19శాతం ఉత్తీర్ణత


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాలను శనివారం ఒంగోలులో యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబులు విడుదల చేశారు. ఈ పరీక్షల్లో కేవలం 46.19శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. యూనివర్శిటీ పరిధిలోని 88 డిగ్రీ కళాశాలల్లో మొత్తం 6,807 మంది విద్యార్థులు చదువుతుండగా 6,019 మంది పరీక్షకు హాజరయ్యారు. బీఎస్సీ హానర్స్ విభాగంలో 321 మందికి 141 మంది, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్ విభాగంలో 2,253 మందికి 1,106, బీకాం జనరల్ విభాగంలో 79 మందికి 25, బీఏ ఒకేషనల్ విభాగంలో 31మందికి నలుగురు మాత్రమే పాసయ్యారు. బీఎస్సీ హానర్స్ విభాగంలో 2,496మందికి 1,033 మంది, బీబీఏ విభాగంలో 66మందికి 35, బీసీఏ విభాగంలో 771మందికి 436 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను యూనివర్శిటీ రిజల్ట్ లింకు ద్వారా తెలుసుకోవచ్చని పరీక్షల నియంత్రణ అదనపు అధికారి అంచల భారతి తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వైస్ చాన్సలర్ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కేవీఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

'తవనం' స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు శ్రీకారం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు


సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాపోరాట యోధుడు, జిల్లా వ్యవసాయ కార్మిక ఉద్యమ నిర్మాత తవనం చెంచయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా కేంద్రబడ్జెట్-గ్రామీణ పేదలపైప్రభావం అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. తవనం చంచయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. సమాజంలో కొనసాగుతున్న అంటరానితనం, అవమానాలు, గ్రామీణ పేదలపై పెత్తందారుల దౌర్జన్యాలపై కమ్యూనిస్టు ఉద్యమం నడిపిన పోరాటాలు చెంచయ్యను ఆకర్షించాయని తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా అందించిన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. కేంద్ర వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జాలా అంజయ్య మాట్లాడుతూ తవనం చెంచయ్యతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పోరాట యోధుడుగా, శాసనసభ్యుడుగా ఆయన నిర్వహించిన పాత్ర చిరస్మరణీయుడన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడారు. ముందుగా తవనం చెంచయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య, పట్టపు ప్రకాశం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేజీ.మస్తాన్, పూసా వెంకటేశ్వర్లు, ఎం.ఆంజనేయులు, ఉబ్బా వెంకటేశ్వర్లు వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, గుమ్మా బాలనాగయ్య, వై.వీరనారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా మహాశాంతి హోమం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం దశరాజుపల్లి రోడ్డులోని లక్ష్మీపురంలో నిర్మిస్తున్న శ్రీపద్మావతీ గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం మహాశాంతి హోమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త అబ్బూరి చంద్రమౌళి పర్యవేక్షణలో వేదపండితులు హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఏప్రిల్ నాటికి నిర్మాణం పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠ చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ఇప్పటికే ధ్వజస్తంభాన్ని తెప్పించామన్నారు. ఎడ్లపాటి అశోక్‌కుమార్, బొల్లేపల్లి సత్యనారాయణ తదితర దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పేస్ అధ్యాపకురాలికి డాక్టరేట్


పుష్పశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డేగల పుష్పశ్రీకి అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ గ్రీనఖ్ హెచ్‌ఆర్ఎం ప్రాక్టిసెస్ ఫర్ ఆర్గనైజేషన్ సస్టైనబిలిటి ఇన్ కావీజెన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పుష్పశ్రీ పరిశోధనకు యూనివర్శిటీ పీహెచ్‌డీకి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక కళాశాలలో పుష్పశ్రీని కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, విభాగాధిపతి మేరీజోన్స్ అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : వీసీ


ఎంపికైన క్రీడాకారులతో వైస్ చాన్స్‌లర్ మూర్తి

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూనివర్శిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఏకేయూ అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ టోర్నమెంట్ పోటీల అనంతరం యూనివర్శిటీ హ్యాండ్ బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను వీసీ మూర్తి అభినందించారు. ఈనెల 28నుంచి మార్చి 4 వరకు తమిళనాడులోని పెరియార్ యూనివర్శిటీలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్ బాల్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలుగా నిలువాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌విభాగం డీడీ దేవీవరప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


రవికుమార్‌కు పురస్కారాన్ని అందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్విజిలేటర్ రమ్య కోరారు. శనివారం ఒంగోలులోని శ్రీనిధి ఒకేషనల్ ఫిషరీస్ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాలలో లిటిల్ ఛాంప్స్ అకాడమీ, గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. తెలుగు భాష ఎంతో ఉన్నతమైనదని, చిన్నతనం నుంచే ఆ భాషపట్ల విద్యార్థులు మక్కువ పెంచుకునేలా కృషిచేయాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ వాయిల విజయరత్నం మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి తెలుగువారికి ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. విద్యార్థులు ఆంగ్లంతో పాటు తెలుగు భాషపై కూడా పట్టు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా సత్తెనపల్లికి చెందిన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు స్టార్‌గోల్డెన్ అవార్డు, కొలకలూరి రవిబాబుకు ఘంటసాల జాతీయ సేవా స్ఫూర్తి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూరు శాతం రుణాల రికవరీ సాధించాలి : పీడీ


మాట్లాడుతున్న వెలుగు పీడీ నారాయణ

కొత్తపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన రుణాలను నూరుశాతం రికవరీ సాధించాలని డీఆర్‌డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ ఆదేశించారు. శనివారం కొత్తపట్నంలోని వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ ఇన్వెస్టుమెంటు ఫండు, ఉన్నతి, స్త్రీ నిధి రుణాల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రుణాల రికవరీలో వెనుకబాటు తనాన్ని అధికమించాలని ఆయన కోరారు. రుణాలు పొందిన మహిళలు సకాలంలో వాటిని తిరిగి చెల్లించే విధంగా సీసీలు, ఏపీఎంలు, ఏసీలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రతి పొదుపు మహిళ ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలన్నారు. పొదుపు రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా వారిలో చైతన్యం నింపాలని చెప్పారు. సమావేశంలో ఐబీ ఏపీఎం బెజ్జం రమేష్, ఏపీఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొలచనకోటలో ఇసుక తవ్వకాలను అరికట్టాలి

● అధికారులకు జనసేన నాయకుల ఫిర్యాదు

మద్దిపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ పరివాహక ప్రాంత గ్రామమైన కొలచనకోట రెవెన్యూ పరిధిలో గత కొన్ని రోజుల నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్థులు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం దృష్టికి తెచ్చారు. దీంతో శనివారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించి తవ్వకాల వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎస్ఐ బి.శివరామయ్య, విద్యుత్‌శాఖ ఏఈ చెన్నారెడ్డిలను కలిసి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు ఆరే వెంకటేశ్వర్లు, వీర మహిళ విభాగం అధ్యక్షురాలు కాకర్లపూడి హరిత, నాయకులు నూనె శ్రీనివాసరావు, గుండాబత్తుల సోమశేఖర్, ఏడుగుండ్ల సత్యనారాయణ, కనపర్తి శేషయ్య, దండే రామారావు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆసక్తి కలిగేలా బోధించాలి


మాట్లాడుతున్న హేనా సృజన్

మద్దిపాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ విద్యార్థులకు ఆసక్తికరంగా విద్యా బోధన చేయాలని అంగన్‌వాడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సృజన్ పేర్కొన్నారు. శనివారం గుండ్లాపల్లి, మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో వీడ్కోలు వేడుకలు

కొండపి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్కూల్‌లోని సరస్వతీ విగ్రహం వద్ద హెచ్ఎం సునన్నకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు పూజలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.

నేడు సంగీత విభావరి

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని తాతా బిల్డింగ్స్ ఎదురుగా ఉన్న మ్యూజిక్ ప్లాజాలో ఆదివారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆలపాటి అశోక్‌కుమార్, వారణాసి బాలాజీ, స్వర్ణలత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ విభావరిలో సుమారు 25 మంది గాయకులు పాల్గొని సినీ గీతాలను ఆలపిస్తారని పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి : డీపీవో


కేవీపాలెంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో వెంకటనాయుడు

చీమకుర్తి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి అని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆదేశించారు. మండలంలోని కేవీపాలెం, పి.నాయుడుపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటా తిరుగుతూ తడి, పొడి చెత్త సేకరణను ఆయన ప్రత్యక్షంగా సందర్శించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామనాయకులు, అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో చీమకుర్తి డీసీ-2 అధ్యక్షుడు పాలడుగు వెంకటనారాయణ, ఈవోఆర్డీ అజిత, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ

పూజలు చేస్తామని నగదుతో పరార్

● అరెస్టు చేసి రూ.60 వేలు రికవరీ చేసిన ఎస్ఐ


నగదును బాధితులకు అందజేస్తున్న ఎస్సై

పుల్లలచెరువు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ 'మేం పూజలు చేస్తే మీకు వున్న సమస్యలు తీరుతాయని' నమ్మించి నగదుతో పరారవుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, పుల్లలచెరువు మండలం సిద్దెనపాలెం గ్రామంలో ఈ నెల 17న ఇద్దరు వ్యక్తులు కాషాయ వస్త్రాలు ధరించి వచ్చారు. గ్రామంలో తిరిగి జాతకాలు చెబుతాం, చీడపీడలు తొలగిస్తామని చెప్పి ఇంటింటికి తిరుగుతున్నారు. గ్రామానికి చెందిన సోమేపల్లి హేమలత, ముమ్ము ముక్కంటిలు వీరి మాటలు నమ్మి ఇంట్లో పూజ చేయిస్తున్నారు. మీ ఇంట్లో వున్న నగదును తీసుకొచ్చి పూజలో పెట్టాలని చెప్పారు. అయితే పూజ మధ్యలో వీరు ఇంటిలోకి వెళ్లిన వెంటనే వారు రూ.65300 నగదుతో పరారయ్యారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఇద్దరిని గుంటూరులో అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.60000 నగదును రికవరీ చేశారు. ఆ సొమ్మును బాధితులకు అందజేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హమాలీలకు కూలీ రేట్లు పెంచాలి



గోడౌన్‌లో నినాదాలు చేస్తున్న కూలీలు

కంభం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కంభంలో సివిల్ సప్లై గోడౌన్‌లో పనిచేసే హమాలీలకు పెరిగిన కూలీరేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని ఏపీ సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు అన్వర్ మాట్లాడుతూ పెంచిన కూలీ రేట్ల జీవోను విడుదల చేయాలన్నారు. కూలీరేట్లు వెంటనే పెంచకపోతే సమ్మెకు సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్నరంగస్వామి, చిన్నరంగయ్య, వెంకటరమణ, రామయ్య, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలకే పీఎం కిసాన్ నిధులు

గిద్దలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పీఎంకిసాన్ 19వ విడత నిధులు రైతులకు విడుదల కానున్నట్లు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3వ విడత గిద్దలూరు నియోజకవర్గంలో 35,551 మంది రైతులకు సంబంధించి రూ.7.11 కోట్లు విడుదలవుతాయన్నారు. రైతుల అకౌంట్లలో నేరుగా జమచేయనున్నట్లు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి


రైతుల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ, సంక్షేమ పథకాలు నేరు గా రైతుల ఖాతాలో పడేందుకు రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వ్యవసాయశాఖ అధికారులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఎర్రగొండపాలెం ఏవో కేవీ శేషారెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కొలుకుల, వీరభద్రా పురం తదితర గ్రామాలలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సాగులో ఉండి పొలం ఉన్న ప్రతి రైతు ఈ 11 నెంబర్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులను కోరుతున్నారు. ఆయా కార్యక్రమాలలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన

గిద్దలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతువిశిష్ట సంఖ్య నమోదుపై శనివారం అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని జయరాంపురం, వెల్లుపల్లి, అంబవరం గ్రామాలలో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఏవో ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతుకు కేటాయించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీ ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందవచ్చన్నారు. ఈసంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తోందన్నారు. ఆధార్, భూరికార్డు వివరాలు తీసుకుని రైతుసేవా కేంద్రాల సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యాన, వ్యవసాయ శాఖల సహాయకులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని ప్రతి రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని ఏవో జవహరలాల్‌నాయక్ అన్నారు. మండలంలోని కడపరాజుపల్లె గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట సంఖ్య నమోదుతోనే పీఎం కిసాన్, రైతుభరోసా వంటి ప్రభుత్వ పథకాలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ సుస్మిత, ఏఈవో చైతన్యకుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కంభం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కంభం 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కంభం, బేస్తవారపేట, అర్థవీడు మండలాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీ శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బేస్తవారపేట, అర్థవీడు, కంభం మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఎల్.కోట, చిన్నకంభం, యర్రబాలెం, రావిపాడు సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

మార్కాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బకాయిలు ఉన్న విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని మార్కాపురం విద్యుత్‌శాఖ ఏడీఈ షియానాయక్ తెలిపారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయంలోని కౌంటర్ వద్ద ఆదివారం కూడా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

అడవిలో కార్చిచ్చు

గిద్దలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం జే.పీ.చెరువు గ్రామసమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కారుచిచ్చు మంటలు చెలరేగాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. మంటలు దావాలంగా వ్యాపించడంతో అటు అడవికి, ఇటు వన్యప్రాణులకు హాని కలుగుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలోని కొండల వద్ద ఎండుగడ్డి ఉన్న సందర్భాలలో దానిని కాలిస్తే అదిపోయి తిరిగి పచ్చగడ్డి మొలుస్తుందన్న ఉద్దేశ్యంతో కొందరు ఇలాంటి నిప్పు పెడుతుంటారని గ్రామస్తులు చెబుతున్నారు.

అలంకారప్రాయంగా సంపద తయారీ కేంద్రాలు

నెరవేరని స్వచ్ఛభారత్ లక్ష్యం

కంభం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కార్యరూపం దాల్చడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడుతోంది. దీనికి తోడు ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ పాలనలో డంపింగ్ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన ఘన వ్యర్థ పదార్థాల నుండి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. కంభం మండలంలో 14 పంచాయతీలు ఉండగా అందులో కంభం, చిన్నకంభం, జంగంగుంట్ల, ఎల్.కోట, ఔరంగ బాద్, రావిపాడు, దర్గ, యర్రబాలెం, లింగాపురం, నర్సిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలలో చెత్తసంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. కందులాపురం, తురిమెళ్ల పెద్దనల్లకాల్వ పంచాయతీలలో స్థలం చూపక పోవడంతో నిర్మాణాలు చేపట్టలేదు. ప్రభుత్వం నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలలో చెత్తను వేసి వ్యర్థాలను కుళ్లబెట్టి వానపాముల ద్వారా గుల్లగా చేసి వర్మి కంపోస్టు తయారీ చేయాల్సి ఉంది. వీటి నిర్వహణకు సంబంధించి ఉపాధి హామీ అధికారులు సిబ్బందిని నియ మించి గ్రామాలలో అక్కడక్కడా తొట్లు నిర్మించాల్సి ఉంది. ఈ విషయంలో ఉపాధిహామీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ఈ పథకం అటకెక్కింది. దీనికితోడు రోడ్లకు ఇరువైపులా వ్యర్థాలను పడవేస్తున్నారు. కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకు పోవడంతో వాహనదారులకు అసౌకర్యంగా ఉండడమే కాక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చెత్తకు నిప్పుపెట్టడంతో పొగతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, పంచాయతీలకు ఆదాయం సమకూరు తుందనే ఉద్దేశ్యంతో ఈ కేంద్రాలను నిర్మించారు. అయితే పథకం అమలులో అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్లవెంబడి ఉన్న చెత్తాచెదారం


నిరుపయోగంగా ఉన్న చెత్తసంపద కేంద్రం

చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదు: ఈవోఆర్‌డీ

ఎర్రగొండపాలెం రూరల్ : స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తమ్మడపల్లి, వాదంపల్లి, అమానిగుడిపాడు తదితర గ్రామాలలో డంపింగ్ యార్డులను ఈవోఆర్‌డీ ఈదుల రాజశేఖర రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడిచెత్త, తడిచెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారాలు వేస్తే చలానా విధిస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని డంపింగ్ యార్డులను పరిశీలించారు. డంపింగ్ యార్డులను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే నిరుద్యోగ యువతకు ఉపాధి

కంభం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువత వృతి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన సంకల్ప్ మెగా జాబ్‌మేళ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో పూర్తిగా వెనుకబడిన గిద్దలూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఈ మెగా జాబ్‌మేళను కంభంలో ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలోని 21 కంపెనీలు ఇక్కడకు వచ్చాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరై వారి నైపుణ్యంతో ఉద్యోగం పొందవచ్చన్నారు. మొత్తం 229 మంది దరఖాస్తు చేసుకోగా 131 మంది ఉద్యోగాలు పొందారు. 15 మంది షార్ట్‌లిస్టు అయ్యారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తోట వెంకటశ్రీనివాసులు, కేతం శ్రీనివాసులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అనీస్‌అహమ్మద్, బీజేపీ మండల అధ్యక్షుడు బాదం కిశోర్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణకిషోర్‌రెడ్డి

నైపుణ్య శిక్షణ పొందాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణ పొంది భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలని మాస్టర్ ఎడ్యుకేషన్&సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు చదివి పాస్/ఫెయిల్/డిస్‌కంటిన్యూ అయిన నిరుద్యోగులు తమ సంస్థ నిర్వహించే నైపుణ్య శిక్షణను ఉచితంగా పొందవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 500 మందికి ఉచితంగా స్వయం ఉపాధి వ్యాపారాలపై శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వివరాలకు 8897837783 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతవిద్యను అభ్యసించాలి

● ఎంఈవో మస్తాన్ నాయక్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. స్థానిక బీఎం డిగ్రీ కళాశాల, వసంత జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాలల చైర్మన్ బట్టు రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు కీలకమైన దశ ఇంటర్మీడియట్, డిగ్రీ అని ఇక్కడ వేసిన అడుగులే జీవిత లక్ష్యాలను నిర్దేశిస్తాయన్నారు. విద్యార్థులు చక్కగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఎస్సై మహేశ్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్టు లేకుండా వాహనాలను నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంటు బట్టు సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు కే.సుబ్బారెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో తారు రోడ్డు నిర్మాణం


రోడ్డు పరుస్తున్న కార్మికులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద రోడ్డు సక్రమంగా లేకపోవడంతో దాతల సహకారంతో రోడ్డు నిర్మాణాన్ని శనివారం చేపట్టారు. కాంట్రాక్టర్ సూర్యం చొరవ తీసుకొని వై.టీ రోడ్డు నుంచి నుంచి కొండ తూర్పువైపు మెట్ల వరకు తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతోపాటు కొండపైకి వెళ్లే మార్గంలోని రోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు పూర్తిచేశారు. ఆలయానికి వచ్చే భక్తుల కార్లు, బస్సులు, ట్రాక్టర్లు, బైకులు ఇతర వాహనాలకు రహదారి సమస్య తీరింది.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని వాసవి విద్యానికేతన్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ అకట్టుకొంది. 400 మంది విద్యార్థులు 200 సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. డీఎస్పీ నాగరాజు సైన్స్ ప్రదర్శన ప్రారంభించారు. విద్యార్థులను వైజ్ఞానిక ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమోనాలు ఆలోచింపజేశాయి. భూకంపాలు వచ్చే సమయం లో మ్రోగే అలారం, అగ్ని పర్వతం, ఆహారధాన్యాలు, మాయా సాదువు, సోలార్ సిస్టం ప్రాజెక్టులు, వివిధ అంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి శ్యామ్యూల్, ఎంఈవోలు శర్వాణి, రాందాస్‌నాయక్‌లు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, అపుస్మా అధ్యక్షులు గొట్టం మల్లికార్జున రెడ్డి, వాసవి పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె.రంగయ్య, ఏవో రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని రాక్‌వెల్ పాఠశాల చైర్మన్ వెన్నా నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక రాక్‌వెల్ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యాన్ని ముందుగానే పరిరక్షించేందుకు శనివారం వార్షిక ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఎం.సునీత, ఎం.రాంబాబు, చంద్రశేఖర్, తోటప్రసాద్‌లు విద్యార్థులను పరీక్షించారు. పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, దంత సంరక్షణ, కళ్లు, చెవులు, ముక్కు ఆరోగ్యం గురించి విలువైన సూచనలు అందించారు.

యాదవ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో యాదవ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా యాదవ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కార మార్గాలను సూచించారు. సమస్యల పరిష్కారం కోసం అందరూ సంఘటితంగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశానికి ఓ.వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాదవ సంఘ ప్రతినిధులు నంద్యాల శ్రీనివాసులు, జింకా వెంకటేశ్వర్లు, చల్లా రమేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా యాదవ సంఘ గిద్దలూరు నియోజకవర్గ అధ్యక్షులుగా గంగాల బాలయ్య, మహిళ విభాగం అధ్యక్షురాలిగా బొంతా లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు పీరయ్య, మహేంద్ర, గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, ఉపకార్యదర్శులుగా రాజయ్య, మహేష్, ఈశ్వరయ్య, కోశాధికారిగా ఎస్. అల్లూరయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరం దరికీ, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షులు ఓ.వెంకటయ్య నియామక పత్రాలు అందచేశారు.

శ్రీ చైతన్య పాఠశాలలో పాద పూజ


తల్లికి పూజ చేస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్‌లివింగ్ ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తో తల్లిదండ్రులకు పాద పూజోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.ఆదినారాయణ మాట్లాడుతూ, తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవం అన్నారు. పాదపూజ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్ఐ సురేంద్ర, కోఆర్డినేటర్ వీరాంజనేయులు, డీన్ సీహెచ్ శ్రీనివాసులు, ఏవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ


అట్టలను అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం ఆకవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నిసేవాసంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పి.మధ్రికుమార్ అట్టలను సమకూర్చగా హెచ్‌ఎం సుధాకర్‌రావు, చిన్న సేవాసంస్థ అధ్యక్షులు ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం రుణాల రికవరీ సాధించాలి : పీడీ

కొత్తపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన రుణాలను నూరుశాతం రికవరీ సాధించాల ని డీఆర్‌డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి. నారాయణ ఆదేశించారు. శనివారం కొత్తప ట్నంలోని వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క మ్యూనిటీ ఇన్వెస్టుమెంటు ఫండు, ఉన్నతి, స్త్రీ నిధి రుణాల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రుణాల రికవరీలో వెనుకబాటుతనాన్ని అధిగమించాలని ఆయన కోరారు.

ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

తర్లుపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కలుజువ్వలపాడు పంచాయతీలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నరసింహారెడ్డి చిత్రపటాన్ని చేతబట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మౌలాలి మాట్లాడుతూ. మొదటి స్వాతంత్ర్య పోరాటానికి పదేళ్ల ముందే బ్రిటీష్ వారిపాలనపై తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. తెలుగువారి పోరాట స్ఫూర్తిని బ్రిటీష్ వారికి చూపించిన దిశాలి నరసింహారెడ్డి అని అన్నారు. ఈయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశభక్తి తో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు షేక్ షెక్షావలి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి శనివారం రెడ్డి సంక్షేమసేవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు వృథా కాకుండా దేశసంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అమరుల బాటలో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలపాటి వెంకట రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గుంటక వెంకటరెడ్డి, మారంరెడ్డి కృష్ణారెడ్డి, రమణారెడ్డి, తిరుమలరెడ్డి రామారెడ్డి, నరసింహారెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, గుంటక వనజాక్షి, తాటిపర్తి చెన్నారెడ్డి, బొమ్మిరెడ్డి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురంలో నరసింహారెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

గిద్దలూరు : ప్రథమ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి కార్యక్రమం పలుచోట్ల నిర్వహించారు. మండలంలోని కెఎస్‌పల్లి, పొదల కొండపల్లి, ముండ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నరసింహారెడ్డి చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. బ్రిటీష్ పాలకులను నరసింహారెడ్డి ఎదిరించి పోరాడి ప్రాణాలు కోల్పోయిన తీరు గురించి పలువురు వివరించారు. గిద్దలూరులోని విశ్రాంత ఉద్యోగు ల భవనంలో సైతం నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసింహా రెడ్డికి భారతరత్న ఇచ్చి గౌరవించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ప్రతినిధి బి.ఎస్. నారాయణరెడ్డి, సూరం నారాయణరెడ్డి, బీజెపి పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్ శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, కమ్యునిటి హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, పలు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కలుజువ్వలపాడులో నరసింహారెడ్డి చిత్రపటానికి విద్యార్థుల నివాళి

ఎర్రగొండపాలెం : స్వతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవలు మరువలేనివని ఎర్రగొండపాలెం రెడ్డి సంక్షేమ సేవ సంఘం నాయకులు అన్నారు శనివారం పట్టణంలోని రాజీవ్ అతిథిగృహంలో ఉయ్యలవాడ నరసింహారెడ్డి 187వ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసింహారెడ్డి స్వాతంత్ర్యం కోసం పోరాడిన మొదటితరం మహనీయుడనీ కొనియడారు కర్నూలు జిల్లాలో జన్మించిన అయన అంగ్లేయులు గుండేల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. ఎర్రగొండపాలెం పట్టణంలో ఉయ్యలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవ సంఘం నాయకులు ఒంగోలు మూర్తి రెడ్డి, శనగ నారయణరెడ్డి , నరెడ్ల వెంకటరెడ్డి యర్రం వేంకటేశ్వర రెడ్డి , తమ్మినేని యోగి వీరారెడ్డి నారు నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, నూజెండ్లపల్లి గ్రామాల్లో శనివారం మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మణిశంకర్, డాక్టర్ ప్రవీణ్ ప్రకాష్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ముందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'పై శిక్షణ

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు తగురీతిలో అభ్యసన చేయిస్తున్నట్టు ఎంఈవో డీవీ సుబ్బారావు తెలిపారు. ఇందుకుసంబంధించి అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం. రామస్వామి, సూపర్‌వైజర్ గోళ్ల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

పీసీపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన కోడూరి బ్రహ్మయ్యకు శనివారం బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ అందజేశారు. అదే గ్రామానికి చెందిన వంజా చంద్రయ్య తనకు తెలిసిన విజయవాడ రైల్వేలో లోకో పైలట్‌గా పనిచేస్తున్న చందోలు వెంకటకోటేశ్వరరావు దృష్టికి దివ్యాంగుడు బ్రహ్మయ్య పడుతున్న ఇబ్బందులను తీసుకెళ్లాడు. స్పందించిన వెంకట కోటేశ్వరరావు 60వేల రూపాయల విలువ కలిగిన బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్‌ను తెప్పించాడు.

శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ట్రైసైకిల్‌ను తన సోదరి వెంకటసుజాత జ్ఞాపకార్థం ఎంఈవో సంజీవి, శ్రీనివాసులు చేతుల మీదుగా బ్రహ్మయ్యకు అందజేశారు. అలాగే స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేస్తున్న సాధు శ్రీనివాసరావు కుర్చీలను అందజేశాడు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లా మల్లికార్జున్, ఇన్‌చార్జ్ హెచ్ఎం శేషారావు, సంగటి పిచ్చిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మల్లికార్జున, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కేపీఎం గౌస్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

పామూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పామూరు మండలంలోని వగ్గంపల్లిలో అనుమానాస్పద స్థితిలో మహిళ సజీవ దహనమైన ఘటన శనివారం వెలుగుచూసింది. ఎస్సీ కాలనీకి చెందిన పూనూరు ప్రేమమ్మ(55) కుమారుడు జానీ, కోడలు సురేఖతో కలిసి ఉంటున్నది. కొంతకాలంగా ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నది. రోజుమాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంటి వరండాలో నిద్రించింది. శనివారం తెల్లారి చూసేసమయానికి సజీవదహనమై ఉంది. సమాచారం అందుకున్న సీఐ ఎం భీమానాయక్ మృత దేహాన్ని పరిశీలించారు. ఆమెది హత్యా, లేక ప్రమాదశాత్తుగా జరిగిందా, ఆత్మహత్యకు పాల్పడిందా అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

24లోగా భూఆధార్ చేయించుకోవాలి

పామూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం వ్యవసాయభూమి కలిగిన రైతులందరూ సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 24లోగా భూఆధార్ నమోదు చేయించుకోవాలని ఏవో కె.రాధ తెలిపారు. శనివారం మండంలోని కంభాలదిన్నె రైతు సేవా కేంద్రంలో విశిష్ట గుర్తింపు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు అవగాహన కలిగించారు.

చెత్తసంపద కేంద్రాల పరిశీలన

కురిచేడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నమశ్శివాయపురం, పెద్దవరం, దేకనకొండ గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న చెత్తసంపద కేంద్రాలను శనివారం ఎంపీడీవో సతీష్‌బాబు పరిశీలించారు. వీటిని వినియోగంలోకి తీసుకురావాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. ముందుగా షెడ్లు, పరిసరాలు శుభ్రం చేయించాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మించిందన్నారు. వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఆయన సూచించారు.

డిగ్రీ ఫలితాల్లో గౌతమి విద్యార్థుల ప్రతిభ

దొనకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో శనివారం సాయంత్రం విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో దొనకొండ గౌతమీ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో షేక్ షమీమా 709 మార్కులు, ఏ.పెద్దకాశమ్మ 623 మార్కులు, జి.నర్సింహారావు 594 మార్కులు సాధించారు. బీఏ విభాగంలో షేక్ అజీజ్ 371, పి.అఫ్రీన్ 368, బి.ఏసుబాబు 350 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గౌతమీ డిగ్రీ కాలేజీల చైర్మన్ గుండారెడ్డి, సీఈవో నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు అభినందించారు.

పంచాయతీరాజ్ శాఖ నిర్వీర్యం

» సిబ్బంది కొరతతో కుంటుపడుతున్న పనులు



దర్శిలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం

దర్శి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ రోజురోజుకు నిర్వీర్యం అవుతుంది. అధికారులు, సిబ్బంది కొరతతో పనులు కుంటు పడుతున్నాయి. దర్శి పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ పరిధిలో ఐదు మండలా లు ఉన్నాయి. సబ్‌డివిజన్ పరిధిలో ఐదు ఏఈ పోస్టు లు ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. దర్శి, కురిచేడు, దొనకొండ మండలాలకు ఒక ఏఈ మాత్రమే ఉన్నారు. తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలకు మరో ఏఈ ఉన్నారు. డీఈ పోస్టు కూడా డిప్యుటేషన్‌పై సాగుతుంది. అద్దంకిలో డీఈగా పనిచేస్తున్న విఠల్ రాఠోడ్ ఇన్‌చార్జ్ డీఈగా పని చేస్తున్నారు.

దర్శి నియోజకవర్గంలోని 96 పంచాయతీల్లో సిబ్బంది కొరతతో పనులు ముందుకు సాగటం లేదు. జడ్పీ పనులు, మండల పరిషత్ నిధుల ద్వారా చేపట్టే పనులు కూడా వీరే నిర్వహించాల్సి ఉంది. సిబ్బంది కొరతతో పనిభారం అధికమై ముందుకు సాగటం లేదు. ఎంతో కాలంగా ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీకి నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవటంతో అధ్వానంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత గుంతలు పూడ్చి మరమ్మతులు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టేందుకు అన్నీ మండలాలకు ఇంజనీరింగ్ సిబ్బందిని నిర్వహించాల్సి అవసరం ఉంది. ఉన్నతాధికారులు సిబ్బంది కొరతను గుర్తించి అన్నిపోస్టులు భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ విధి విధానాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంత వాసులు ఉపాధి లేక వలసలు వెళ్ళి జీవనం సాగిస్తున్నారన్నారు. కనిగిరిలో నిరుద్యోగులు ఉపాధి, ఉద్యోగాలు లేకుండా ఖాళీగా ఉండకుండా చేసేందుకు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులు అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన రిజిస్ట్రేషన్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. తద్వార వారి విద్యార్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఈఅవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రికి వితరణ

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో డయాలసిస్ రోగుల సంఖ్య నానాటికి పెరుగుతుండటంతో ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో సేవలు అందించేందుకు ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో దాతల సహకారంతో డయాలసిస్ కేంద్రంలో అదనంగా మరో పది మందికి డయాలసిస్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

అందుకోసం ప్రత్యేకంగా రెండు ప్రెజనీస్ మెషిన్లు తెప్పించారు. వాటిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో రోజుకు మరో పది మందికి డయాలసిస్ చేయించుకునే సదుపాయం అందనుంది.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

» డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



ఉమామహేశ్వర అగ్రహారం సబ్ సెంటర్‌ను సందర్శించి వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, నూజెండ్లపల్లి గ్రామాలను సందర్శించారు. కొన్నిరోజులుగా ఈగ్రామాల ప్రజలు చికెన్ గున్యా, విషజ్వరాలతో మంచం పట్టారు. వీరిని పరామర్శించిన అనంతరం ఉమామహేశ్వర అగ్రహారంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలటానికి ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించడమే కారణమేనన్నారు. వ్యాధిభారిన పడిన రోగులు కోలుకొనేంత వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించాలన్నారు. ఉమామహేశ్వర అగ్రహారంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వైద్యులు తెలిపారు. దీంతో ఆయన పంచాయతీ కార్యదర్శి మౌలాలితో ఫోన్‌లో మాట్లాడి పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు.

కార్యక్రమంలో మారెళ్ళ వైద్యాధికారి మణిశంకర్, సీహెచ్‌వో రాజేశ్వరి, ఎం.శరణ్య, హెచ్ఈ కె.రాజు, సీహెచ్‌వో వెంకటరావు, సూపర్‌వైజర్ అంజమ్మ తది తరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న ఆర్టీసీ ప్రాంగణం

» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

కనిగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ఆర్టీసీ డిపో ప్రాంగణం కంపు కొడుతుంది. ఎక్కడ చూసినా చిల్లచెట్లు, చెత్త కుప్పలతో అపరిశుభ్రంగా ఉంది. ఆర్టీసీ ప్రాంగణమంతా దుమ్ము లేస్తూ ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారి కంపు కొడుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో ఆర్టీసీ ప్రాంగణంలోకి అడుగు పెట్టాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఆర్టీసీ డిపోల రూపురేఖలు మార్చారు. ప్రయాణికులకు మేలైన సౌకర్యాలు కల్పించారు. డిపోలన్నీ పరిశుభ్రంగా ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోలేదు. ఆర్టీసీ అభివృద్ధితోపాటు వసతులు కూడా కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర పథకం కింద ఆర్టీసీ డిపోల్లో మెరుగైన వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశారు. అందులోభాగంగా కనిగిరి డిపోలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ5.70లక్షలు విడుదల చేశారు. ఆయా నిధులతో డిపో ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో కూడిన టాయిలెట్స్ నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని వినియోగించలేదు. దీంతో నిధులు దుర్వినియోగంగా మారాయి. నిర్మించిన టాయిలెట్స్ గదుల్లో చెత్తా చెదారాలతో పాటు చెట్లు మొలిచాయి. ఐదేళ్లుగా వీటి గురించి పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి వసతులు కల్పించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ డిపో మేనేజర్ షయాబేగంను వివరణ కోరగా.. నీటి వసతి లేకపోవటంతో టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయన్నారు. డిపోలో ఒకే బోరు ఉండటంతో ఉన్న టాయిలెట్స్ వాడుకకు వినియోగిస్తున్నట్టు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి నివేదిక పంపి అదనంగా బోరు పాయింట్ ఏర్పాటుకు, టాయిలెట్స్‌ను వాడేందుకు చర్యలు తీసుకుంటామని డీఎం పేర్కొన్నారు.



నిరుపయోగంగా స్వచ్ఛాంధ్ర టాయిలెట్స్

సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల పరిశీలన



సమ్మర్‌స్టోరేజీ నీటి పంపింగ్ మోటార్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

దొనకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని చందవరం-1, చందవరం-2 సాగర్ జలాల సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకర్, జడ్పీ సీఈవో చిరంజీవి శనివారం పరిశీలించారు. సాగర్ కెనాల్‌లో ఎంత శాతం నీటి ప్రవాహం జరుగుతుంది, స్టోరేజీల్లో ఎంతశాతం నీరు నిల్వ ఉంది, స్టోరేజీల సామర్థ్యం, మోటార్ల పనితీరు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. స్టోరేజీల నుంచి గ్రామాలకు నీటి సరఫరా అందించటంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానిక అధికారులను ప్రశ్నించారు. స్టోరేజీల్లో తగినంత నీరు నిల్వ ఉందని, ఇంకా సాగర్ కెనాల్ నుంచి స్టోరేజీలకు నీటిని పంపింగ్ చేయటం జరుగుతుందన్నారు. మోటార్లు సక్రమంగా పనిచేస్తున్నాయని స్థానిక అధికారులు వివరించారు. గ్రామాల్లో ప్రజలకు వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా అధికారులు సూచించారు. ఎటువంటి సమస్య ఏర్పడినా నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కిరణ్‌కుమార్, శ్రీకాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న కాళహస్తీశ్వరాలయం



కురిచేడులోని ప్రాచీన కాళహస్తీశ్వరాలయం



కాళహస్తీశ్వర స్వామి

కురిచేడు, ఫిబ్రవరి 22: కురిచేడులోని అతిప్రాచీన కాళహ స్తీశ్వరస్వామి దేవాలయం భక్తులు కొలిచే దైవంగా విరాజిల్లుతున్నది. ఒకప్పుడు రంగ రంగ వైభవంగా వెలిగి యాగయాజ్ఞాదులు నిర్వహించిన శివాలయం నేడు కూడా కార్తీక మాసంలో లక్షబిల్వార్చన, మహాశివరాత్రి ఉత్సవాలు లాంటి కార్యక్రమాలను జరుపుకుంటున్నది. కురిచేడు మండలంతో పాటుగా ఇతర మండలాలలో ఏ ఇంట్లో పిల్లలకు శాంతి చేయాలన్నా కురిచేడులోని ప్రాచీన శివాలయానికి వస్తుంటారు. ఆలయంలో శిలా శాసనాల ద్వారా ఆలయ చరిత్ర తెలుస్తున్నది. శివవుని ఎదురుగా నందీశ్వరుని విగ్రహం వద్ద రెండు శిలా శాసనాలు ఉన్నాయి. శివరాత్రి పర్వదినం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీవారు ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి కొత్త రంగులు వేయించి, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శివాలయంలోని కాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి విగ్రహాలపై భానుడి కిరణాలు సంవత్సరానికి రెండుసార్లు తాకి భక్తులకు కనువిందుచేస్తున్నాయి. నందీశ్వరుని తలమీద ఉన్న రెండు కొమ్ముల మధ్య నుంచి ప్రారంభమయ్యే భానుడి కిరణాలు విఘ్నేశ్వరుని స్పృశిస్తూ స్వామి, అమ్మవార్లను నిలువెల్లా తాకి పునీతమవుతాయి. ఆ సమయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆనంద పారవశ్యులవుతారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

కురిచేడులో శివమాల వేసుకున్న శివస్వాములు పాదయాత్రగా శనివారం శ్రీశైలం బయలుదేరారు. కురిచేడులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో స్వామి వారికి పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హాజరై శివస్వాముల పాదయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలను వసూలు చేయాలి



మారెళ్ళ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూలు చేయాలని ట్రాన్స్‌కో ఈఈ పాలగిరి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మారెళ్ళ, ముండ్లమూరు సబ్‌స్టేషన్‌లను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి సబ్ డివిజన్ పరిధిలో రూ.17 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయన్నారు. అందులో వ్యవసాయ కనెక్షన్‌లకు సంబంధించి రూ.4 కోట్లమేర ఉన్నాయన్నారు.

ముండ్లమూరు మండలంలో రూ.1.30 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని చెప్పారు. సబ్ డివిజన్‌లోని ఏఈలు స్పెషల్ డ్రైవ్ ద్వారా మార్చి నెలాఖరుకల్లా పూర్తి స్థాయిలో వసూలు చేయాలని ఈఈ శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలో రైతులకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురయ్యాయన్నారు. వచ్చే నెలాఖరుకల్లా రైతులందరికీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇస్తామని చెప్పారు. సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఇమ్మానియేలుబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య, లైన్‌మన్‌లు అంజనేయులు, మధు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

ముండ్లమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలుకుటుంబాలను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పరామర్శించారు. వేములబండకు చెందిన కంచుమాటి ఏడుకొండలు గృహం కాలిపోవటంతో బాధితుడికి రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన సాధు అంజమ్మ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడటంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించి భర్త వెంకటరెడ్డికి లక్ష రూపాయలు నగదును అందజేశారు. వేంపాడుకు చెందిన గండి అనీల్, మహేష్, గండి వీరయ్యలను పరామర్శించి ఆర్థికసాయం చేశారు. ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన బాలగోపాల్ మృతి చెందటంతో కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సుంకర బ్రహ్మానందరెడ్డి, సూదిదేవర అంజయ్య, బంకా నాగిరెడ్డి, సర్పంచ్ వేముల శ్రీనివాసులు, మేకల వెంకటేశ్వరరెడ్డి, చింతల అంజిరెడ్డి, సోమేపల్లి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలో యువకుడు గల్లంతు

దర్శి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణ సమీపంలోని సాగర్ కాలువలో పడి యువకుడు గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన పుబ్బాల వీరనారాయణ(17) అనే యువకుడు కాలువలో గల్లంతయ్యాడు. పరిసరాల్లో ఉన్న వ్యక్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఎల్లమ్మ, వెంకటేశ్వర్లు, బంధువులు హుటాహుటీన సాగర్ కాలువ వద్దకు చేరుకున్నారు. కుమారుడి సమాచారం కోసం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈక్రమంలో దర్శి నుంచి కురిచేడు వెళ్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యువకుడి తల్లిదండ్రులను ఓదార్చారు. గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టి యువకుడి ఆచూకీ తెలుసుకోవాలని పోలీసులకు సూచించారు. గజఈత గాళ్లను పిలిపించి పోలీసులు గాలిస్తున్నారు. దీనికిగల కారణాలు తెలియా ల్సి ఉంది.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

దొనకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతిఒక్కరూ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాయని చెప్పారు. శనివారం మండలంలోని కొచ్చెర్లకోట రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాటాడారు. సాగు పొలం ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. రైతులకు రెండు కంటే ఎక్కువ రెవెన్యూ గ్రామాలలో పొలం ఉంటే ఎక్కడోఒకచోట చేయించుకుంటే సరిపోతుందన్నారు. ప్రస్తుతం రైతుల పట్టా భూములకు మాత్రమే సర్వర్ అనుమతిస్తుందని చెప్పారు. అసైన్‌మెంట్, ఈనామ్, దేవదాయ భూములకు సోమవారం నుంచి వస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి.ఈశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడులుచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాచవరం గ్రామంలోని శివారు పొలాల్లోని చిల్లచెట్లలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చింది. దీంతో ఎస్ఐ మాధవరావు ఆదేశాలతో ఐదుగురు పోలీసులు మామూలు దుస్తుల్లో వెళ్ళి పేకాట శిబిరంపై ఆకస్మికంగా దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.2,420 స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుచనున్నట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో ఎంఎస్ఎం విద్యార్థుల ప్రతిభ

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్ఎం విద్యార్థులు ప్రతిభచాటారు. శనివారం సాయంత్రం ఫలితాలు విడుదలయ్యాయి. బీఎస్సీ కంప్యూటర్స్‌లో కిన్నెర స్వాతి 647 మార్కులు, బీకాం కంప్యూటర్స్‌లో గోనుగుంట్ల నందిని 601 మార్కులు, మితుకుల అశ్విని 601 మార్కులు సాధించారు. బీఎస్సీ అగ్రికల్చర్‌లో బద్దిపూడి నేహాదాస్ 606మార్కులు, బీసీఏలో నీలిశెట్టి నాగేంద్ర 563 మార్కులు, బీబీఏలో షేక్ కాకర్ల సల్మా 397 మార్కులు సాధించారు. బీఎస్సీ బోటనీలో కమ్మరికుంట రాహేలమ్మ 534 మార్కులు, బీఏ హిస్టరీలో వేమవరపు అబిషైనీ 313 మార్కులు, బీఏ పాలిటిక్స్‌లో లింగాల హరికృష్ణ 348 మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, డైరెక్టర్ నరేంద్ర, ప్రిన్సిపాల్ వీఆర్ రెడ్డి, అధ్యాపకబృందం అభినందించారు.

శివరాత్రి వేడుకలకు అన్నిశాఖల అధికారులు సహకరించాలి

సీఎస్‌పురం(పామూరు) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఈనెల 26 వరకు 65వ సప్తాహ్నిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఈవో నరసిం హాబాబు తెలిపారు. ఈనెల 26న జరిగే మహాశివరాత్రి జాగారణ మహోత్సవ వేడుకలకు అన్నిశాఖల అధికారులు సహకారం అందించాలని ఆయన కోరారు. శనివారం దేవస్థానం చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ అధ్యక్షతన మహాశివరాత్రి ఏర్పాట్లపై వివిద శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. ఈసందర్భంగా నరసింహాబాబు మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారుగా 25 వేల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సూచనల మేరకు అన్నిసౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. సీఐ ఎం.భీమానాయక్ మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా భక్తులు విలువైన బంగారం వస్తువులను తీసుకురావద్దన్నారు కార్లలో బంగారపు వస్తువులు, సెల్‌ఫోన్‌లు పెట్టొద్దని సూచించారు.

మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రలైన శ్రీశైలం, పునుగోడు, భైరవకోన, నారాయణస్వామి, అనుమునిగిరి దేవస్థానాలకు కనిగిరి డిపో నుంచి 40 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సయానాబేగం తెలిపారు. అనంతరం వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, ఎస్ఐ ఆర్.సుమన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.




చిలకలూరిపేట మేజర్ కాలువ ప్రాంతం విస్తరణ

మహా ఏర్పాట్లు

- తిరునాళ్లకు శరవేగంగా పనులు
- ఉచిత, శీఘ్ర, ప్రత్యేక దర్శనాలకు క్యూలు
- కోటప్పకొండలో రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- కోటయ్య స్వామికి విశేష అభిషేకాలు..
- తరలిరానున్న భక్తులు



కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పండుగ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో 26న బుధవారం జరిగే తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోటయ్య క్షేత్రం లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దేశ ప్రసిద్ధి చెందిన తిరునాళ్లకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీత్రికోటేశ్వరస్వామి దర్శనం కోసం ఉచిత, శీఘ్ర, ప్రత్యేక దర్శనాలకు క్యూలు ఏర్పాటు చేశారు. వీఐపీలు, ప్రొటోకాల్ వీఐపీల కోసం వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలను తాటాకు పందిళ్లతో నిర్మిస్తున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం స్వామి వారి ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు. రెండు లక్షల లడ్లు, లక్ష అరిసెలను భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ, విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో కొండ ప్రాంతం వద్ద ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను, జనరేటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నది. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువన ఏర్పాట్లు చేస్తున్నారు. చిలకలూరిపేట మేజర్ వద్ద స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నారు. పాత కోటేశ్వరస్వామి దేవాలయం వద్ద విద్యుత్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థానం వద్ద ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఆనందం, ఆహ్లాదం కోసం కొండ దిగువన ఎమ్యూజ్‌మెంట్ పార్కు రూపుదిద్దుకుంటున్నది. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాల ఏర్పాట్లలో నిమగ్నమైంది. పోలీసు అధికారులు బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకుంటు న్నారు. వాహనాల రాకపోక లకు ఇబ్బంది లేకుండా చిలక లూరిపేట మేజర్ కాల్వ, నరసరావుపేట రహదారి మధ్యలో ఉన్న ప్రాం తా న్ని విస్తరించారు. ఆయా పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పరిశీలించారు.


దేవస్థానం వద్ద క్యూల నిర్మాణం


లడ్డూ ప్రసాదం తయారీ

రేపు ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఉత్సవాలు సోమవారం ఏకాదశి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో కోటయ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. వేలాదిగా కొండకు భక్తులు తరలిరానున్నారు. మూలవిరాట్ అభిషేకాలకు భక్తులను అనుమతించడంలేదు. అభిషేక మండపంలో స్వామికి అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అభిషేకాలకు రూ.500 టికెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు.

తిరునాళ్లకు 550 ఆర్టీసీ సర్వీసులు

తిరునాళ్ల రోజున నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. చిలకలూరిపేట రోడ్డులో ఘాట్ రోడ్డు పక్కన తాత్కాలిక బస్టాండ్ పనులను ఆర్టీసీ నిర్వహిస్తున్నది. నరసరావుపేట బస్టాండ్, చిత్రాలయ సెంటర్ నుంచి తిరునాళ్ల బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది. తిరునాళ్లకు ప్రత్యేకంగా 550 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నరసరావుపేట నుంచి 280, చిలకలూరిపేట 100, అద్దంకి 35, ఒంగోలు 45, చీరాల 45, వినుకొండ నుంచి 45 బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఘాట్ రోడ్డులో కొండ దిగువ నుంచి ఎగువకు భక్తుల కోసం తిరుమల నుంచి వచ్చిన 85 శేషాద్రి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. నరసరావుపేట నుంచి కొండ దిగువకు టిక్కెట్ రూ.30, కొండ దిగువ నుంచి కొండపైకి టిక్కెట్ రూ.25, చిలకలూరిపేట నుంచి రూ.30, వినుకొండ రూ.60, ఒంగోలు రూ.120, చీరాల రూ.100, అద్దంకి నుంచి రూ.105 టికెట్ ధరగా నిర్ణయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.


కొండ దిగువున తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ పనులు


పీవోల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

ప్రక్రియపై అవగాహన ఉండాలి

ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన అన్ని ప్రక్రియలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్, సెక్టార్ అధికారులకు శనివారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటలకి ఓటింగ్ ప్రారంభించేలా పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల వివరాలు, ఇతర పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను పోలింగ్‌కు సిద్ధం చేయాలన్నారు. టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ సమ యం ముగిసేసరికి కేంద్రం గేట్లు మూసేసి లోపల క్యూలో ఉన్న వారికి స్లిప్పులిచ్చి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో జేసీ భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

2015 రిపీటయ్యేనా?

- మండలి ఎన్నికల్లో విజయం కోసం టీడీపీ
- అప్పటి వరకు రెండుసార్లు టీచర్స్ ఎమ్మెల్సీగా లక్ష్మణరావు ఎన్నిక
- మూడోసారి ఆయన గెలుపునకు నాటి అధికార టీడీపీ బ్రేక్
- ఇప్పుడు పట్టభద్రుల ఎన్నికల్లోనూ అదేవ్యూహంతో అడుగులు




గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 2015లో ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని ఈ దఫా పట్టభద్రుల నియోజకవర్గంలో రిపీట్ చేసేందుకు టీడీపీ అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఆదేశానుసారం ఆరు జిల్లాల నేతలు సమష్టిగా పార్టీకి తిరుగులేని మెజార్టీతో విజయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు నియో జకవర్గాల వారీగా బాధ్యత తీసుకుని పట్టభద్రులను ఆకర్షిస్తున్నారు. 2007లో శాసనమండలి పునరుద్ధరణ జరిగినప్పుడు ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి లక్ష్మణరావు గెలు పొందారు. అనంతరం జరిగిన లాటరీలో ఆయన పదవీ కాలం స్వల్ప వ్యవధిలోనే ముగిసింది. దాంతో 2009లో జరిగిన ఎన్నికల్లో రెండో సారి ఆయన టీచర్స్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2015లో మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాగా వివిధ వర్గాలు ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు తిరుగేలేదని, ఆయన హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని భావిం చాయి. ఆ సందర్భంలో టీడీపీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కాగా ఆ ఎన్నికని సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకం గా తీసుకున్నారు. దాంతో ఆ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే ఏఎస్ రామకృష్ణ గెలుపొందారు. ఇప్పుడు జరగబోతున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నిక సమ యం లోనూ టీడీపీ బలపరిచిన కూటమి అధికారంలో ఉండటం.. సీఎంగా చంద్రబాబు ఉన్నారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్ అంతా రంగంలోకి దిగింది. ప్రచార పరంగా మిగతా అభ్యర్థుల కంటే ఆలపాటి చాలా ముందున్నారు. ఈ విధంగా 2015 టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ విధంగా టీడీపీ అభ్యర్థి గెలుపొందారో అదే రీతిన ఇప్పుడు ఆలపాటి గెలుపు కోసం ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త శ్రమిస్తున్నారు.

సాగర్‌లో.. వారబందీ

9 రోజులు సరఫరా.. 6 రోజులు నిలిపివేత

ఆయకట్టు పరిధిలో 87 వేల ఎకరాల్లో వరి సాగు


సాగర్ కుడి కాలువ

నరసరావుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో వారబందీ విధానాన్ని జలవనరుల శాఖ అమలు చేస్తోంది. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. 9 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. తదుపరి ఆరు రోజులు నిలిపివేస్తారు. రైతులు రబీలో కూడా పెద్దఎత్తున వరి సాగు చేశారు. వారబందీ అమలుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు మార్చి 31 వరకు వారబందీ విధానంలో నీటి సరఫరా చేయనున్నారు. ఈ నెల 28 వరకు నీటి సరఫరా చేస్తారు. తదుపరి ఆరు రోజులు నీటి సరఫరాను నిలిపివేస్తారు. రానున్న వేసవికి తాగుకు కూడా నీటిని కేటాయించాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి సాధారణ విస్తీర్ణం 1,05,695 ఎకరాలు కాగా 86,730 ఎకరాల్లో సాగు చేశారు. మిరపకు మార్చి నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉంటుందని రైతులు తెలిపారు. ఏప్రిల్‌లో రెండు వారాల పాటు వరికి నీరు అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

సాగర్‌లో 177.26 టీఎంసీల నీటి నిల్వ

నాగార్జున సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 177.26 టీఎంసీల నీటి నిల్వ ఉంది జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం 234.60 అడుగులు నీటి మట్టం నమోదైంది. మిర్చికి మార్చి 31 వరకు, వరికి ఏప్రిల్ నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉందని అప్పటి వరకు సాగు నీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

మీ ఇళ్లలో ఇలానే ఉంటారా?

గురుకుల సిబ్బందిపై మంత్రి డోలా ఆగ్రహం
ప్రిన్సిపాల్ తీరుపై బాలవీరాంజనేయస్వామి ఆగ్రహం
మరుగుదొడ్ల అపరిశుభ్రతపై ముఖాముఖిలో విద్యార్థుల ఫిర్యాదు


గురుకుల పాఠశాలలో అధ్వాన్నంగా ఉన్న పరిసరాలను చూపిస్తూ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి

రేపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తరగతి గదులు అధ్వానం.. వంటశాలలు అపరిశుభ్రం.. మరుగుదొడ్లు మురికిమయం.. విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలం.. నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం.. రేపల్లెలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆకస్మిక తనిఖీలో వెలుగుచూసిన అంశాలివి. పాఠశాల వాతావరణం అపరిశుభ్రంగా ఉండడాన్ని చూసి ప్రిన్సిపాల్, సిబ్బందిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ గృహాల్లో కూడా ఇదేవిధంగా ఉంటారా అంటూ వారిని ప్రశ్నించారు. 600 మంది విద్యార్థులు ఉండే వసతిగృహంలో అసలు పడుకునేందుకు వీలుందా అని ప్రశ్నించారు. ఎక్కడ చూసినా దుమ్ము ధూళి, కిటికీలకు తలుపులు లేవని, అపరిశుభ్రత ఉన్నా శుభ్రం చెయ్యకపోవడం ఏమిటంటూ నిలదీశారు. మరుగుదొడ్లు, తరగతిగదులు, వంటగదిని ఆయన పరిశీలించి అక్కడంతా అపరిశుభ్రంగా ఉండటంపై మండిపడ్డారు. మంత్రి దగ్గర ఉండి సిబ్బంది చేత మరుగుదొడ్లను శుభ్రం చేయించారు. మెట్లు, వరండాలతో పాటు విద్యార్థులు పడుకునే గదులను కూడా శుభ్రం చేయించారు. ప్రభుత్వం మారి 9 నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఆర్వో ప్లాంట్‌పై జగన్ ఫొటోను ఎందుకు తొలగించలేదన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఫొటోలను తెప్పించిన మంత్రి స్వయంగా వాటిని ఏర్పా టు చేశారు. ఒక్క సదుపాయం కూడా సరిగా లేదని, నీటి సమస్యతో పాటు ఆహారంలో లోపాలు ఉన్నాయని, గదుల్లో మూడు ఫ్యాన్లు తిరిగితే మూడు ఫ్యాన్లు తిరగడం లేదని, దో మలతో అల్లాడుతున్నామని, జ్వరాల బారిన పడుతున్నామని ముఖాముఖిలో విద్యార్థినులు మంత్రి ఎదుట వాపోయారు. బోధనాంశాలపై సరైన సమాధానాలు చెప్పకపో వడంతో ఉపాధ్యాయులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోకుంటే ఇబ్బందులకు గురవుతారని హెచ్చరించారు.

వైసీపీ మాజీ మంత్రి సోదరినని ప్రిన్సిపాల్ బెదిరింపులు

వైసీపీ మాజీ మంత్రి సోదరినని ప్రిన్సిపాల్ ఇష్టానుసారంగా మాట్లాడుతుందని, విద్యార్థులకు వసతులపై చెప్పినా పట్టించుకోవడం లేదని కొంతమంది సిబ్బంది మంత్రికి చెప్పారు. లక్షల్లో జీతాలు తీసుకుంటూ విద్యార్థులు, సిబ్బందిపైనా మీ ప్రతాపం అంటూ ప్రిన్సిపాల్‌ను మంత్రి మందలించారు. స్నానాలు, ఇతర అవసరాలకు మూడు ఫ్లోర్లు నీటిని మోసుకువెళ్తున్నామని విద్యార్థుల ఫిర్యాదుపై మంత్రి సిబ్బందిని ప్రశ్నించారు. పైపులకు లీకులతో సమస్య నెల కొందని సిబ్బంది చెప్పారు. రిజిష్టర్‌లో మూడు, నాలుగు రోజులు సంతకాలు చెయ్యకపోవడం ఏమిటంటూ ప్రశ్నించారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలకు ఆదేశాలు..

గురుకుల పాఠశాలలో సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, సిబ్బంది సమన్వయం లోపాన్ని గుర్తించామని తనిఖీల అనంతరం మంత్రి విలేకర్లతో చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్ గిరి జా కు మా రి పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలకు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశా రు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ కట్టా సత్యనారాయణ, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఆలూరి డానియేలు తదితరులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేస్తున్న మంత్రి బాలా వీరాంజనేయస్వామి

ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డీఈవో పురుషోత్తం, అధికారులు, విద్యార్థులు

బాపట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వద్దనండి, పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన కోసం ప్రజలలో అవగాహన కల్పించటానికి పట్టణంలోని సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ర్యాలీని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం జెండా ఊపి ప్రారంభించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ డాక్టర్ శరత్‌బోస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన కోసం కృషి చేయాలన్నారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ మనం చెత్తతో మూటకట్టి పారేసిన ప్లాస్టిక్ సంచులను ఆహారం అనుకొని ఆవులు, గేదెలు వంటి మూగజీవాలు తిని వాటి ప్రేగులకు అడ్డుపడటంతో జబ్బుల భారీనపడుతున్నాయని తెలిపారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు మంచి అవగాహనతో గుడ్డ సంచులను, కాగితపు గ్లాసులను, కప్పులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, ఎం.ప్రసన్నాంజనేయులు, గురజాల శ్రీనివాసరావు, జి.శాంతారాం, రఘురాం, అనంతకుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలి

- కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. భూగర్భ జలాల పెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జలవనరులను సంరక్షించటానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. ప్రభుత్వ భవనాలపై కురిసే వర్షపునీరు నేరుగా భూమిలోకి వెళ్ళే ఇంకుడు గుంతలునిర్మించాలన్నారు. 261 ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా ఇచ్చిందని అందులో 112 పూర్తికాగా 129 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మిగిలిన 20 ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూసేకరణ చేపడుతున్నామని కలెక్టర్‌కు పంచాయతీరాజ్ ఎస్ఈ వివరించారు. నిర్దేశిత లక్ష్యాలను యుద్ధప్రాతిపదికన ఈనెలాఖరుకు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈని ఆయన ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో 190 మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం లక్ష్యాలను ఇచ్చిందన్నారు. తాగునీటి సరఫరాలో ఇచ్చిన లక్ష్యాలను కూడా పూర్తి చేశామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 73 అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యుత్ కనెక్షన్‌లను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందులో 46 కనెక్షన్‌లకు సర్వీస్ వైరు ఏర్పాటు చేయగా మిగిలిన 27 కనెక్షన్‌లను ఈనెలాఖరికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఈనెలాఖరులోపు పూర్తి చేసి నివేదిక అందించాలని సంబంధితాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈ జి. రత్నబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మాధవి, ఏపీసీపీడీసీఎల్ డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి



రాజుగారిపాలెం వాగు అంచున పడేసిన గ్రానైట్ వ్యర్థాలు

వాగు అంచున గ్రానైట్ వ్యర్థాలు

మార్టూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళలో ట్రాక్టర్‌పై గ్రానైట్ వ్యర్థాలను తీసుకువచ్చిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మండలంలోని రాజుగారిపాలెం వాగు అంచున పడవేసిపోతున్నారు. కొద్ది రోజుల కిందట ఒక చోట కుప్పగా కనిపించిన వ్యర్థాలు శనివారం నాటికి మూడుచోట్ల రెట్టింపు కుప్పలుగా కనిపిస్తున్నాయి. గ్రానైట్ పరిశ్రమలలో పనికిరాని వ్యర్థాలను దూరంగా మార్టూరు కొండ సమీపంలోని డంపింగ్ ప్రదేశంలో పడవేస్తుంటారు. అంతదూరం ఎందుకులే అని అనుకున్నారో ఏమో గానీ కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు వారి పరిశ్రమలలోని వ్యర్థాలను సమీపంలోని రాజుగారిపాలెం వాగు అంచున పడేసి వెళ్తున్నారు. రాజుగారిపాలెం తూముల చప్టాకు రెండు వైపులా గ్రానైట్ కుప్పలు పెరిగిపోతున్నాయి. దీనిపై అడిగేవారెవరూ లేకపోవడంతో రోజురోజుకు గ్రానైట్ వ్యర్థాలను ఎక్కువగా పడేస్తున్నారు. దాంతో మధ్యాహ్నం సమయంలో గ్రానైట్ వ్యర్థాలు నుంచి గాలికి ఎగిరిన బూడిదతో రోడ్డుపై వెళ్లేవాహనదారులకు ఇబ్బందిగా మారింది. అంతేగాకుండా గ్రామంలో కాలుష్యం బూడిద రూపంలో వస్తున్నదని గ్రామస్థులు అంటున్నారు. అదీగాకుండా వాగు అంచున పడేసిన గ్రానైట్ వ్యర్థాలు వాగునీటిలోకి జారితే వాగునీరు కలుషితంగా మారే అవకాశం ఉంది. వాగునీటిని పొలాలకు, పశువులు తాగేందుకు, మహిళలు వస్త్రాలు ఉతుక్కోవడానికి వినియోగిస్తారు. అయితే ఈ వాగు నీరు గ్రానైట్ వ్యర్థాల ద్వారా కలుషితమయ్యే అవకాశం ఉండడంతో గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రానైట్ వ్యర్థాలు పడవేసేవారికి అడ్డుకట్టవేయాలని గ్రామస్థులు బావిస్తున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీఎం రవీంద్రబాబు

ఇంకొల్లు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా గ్రూపు మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలని జిల్లా డీపీఎంఎల్‌హెచ్ రవీంద్రబాబు పేర్కొన్నారు. వెలుగు కార్యాయలంలో ఇంకొల్లు క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల వెలుగు సిబ్బందితో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు, చినగంజాం, మార్టూరు మండలాలల సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై అవగాహన కలిగించారు. గ్రూపులో సభ్యులుగా ఉండి ఆహార ఉత్పత్తులను తయారు చేసుకునేవారికి ఒక్కొక్కరికి రూ.40వేలు 50పైసలు వడ్డీతో రుణాలు అందిస్తామన్నారు. రాయితీలో షేడ్‌నెట్ పొందడంపై కూడా వివరించారు. కార్యక్రమంలో జిల్లా వెలుగు అధికారులు లక్ష్మణాచారి, సురేష్, రవి, ఆరు మండలాల ఏపీఎంలు అనూరాధ, రామకృష్ణ, మోహనరావు, వెంకట్రావు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న మోటార్ సైకిల్

భార్యాభర్తకు గాయాలు



ట్యాంకర్ కిందికి వెళ్లిన మోటార్ సైకిల్

మేదరమెట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో పాల ట్యాంకర్‌ను మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం ఓరుగంటి అంజిరెడ్డి దంపతులు ఒంగోలు నుంచి జె.పంగులూరు మండలం కొండమూరుకు వెళ్తున్నారు. వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద పాల ట్యాంకర్ రోడ్డు దాటుతుండగా మోటర్ సైకిల్ పాలట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న అంజిరెడ్డి, భార్య తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారిలో మోటర్ సైకిల్ వేగంగా రావడం, వాహనాలను గమనించకుండా పాల ట్యాంకర్ రోడ్డు దాటడమే ప్రమాదాలకు కారణంగా భావిస్తున్నా రు. గాయపడిన దంపతులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ అక్రమాలపై ఉక్కుపాదం

- చట్టానికి ఎవరూ అతీతం కాదు
- రెవెన్యూ సిబ్బంది అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయాలి
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చట్టానికి ఎవరు అతీతం కాదని, జిల్లాలో భూ అక్రమాలు, ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(సీసీఎల్‌ఏ) ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా గ్రీవెన్స్ కార్యక్రమాల్లో వచ్చిన రెవెన్యూ సంబంధ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆరా తీశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ వివరించారు. అనంతరం సిసోడియా మాట్లాడుతూ ఎన్నికలు, ప్రకృతి విపత్తుల సమయాల్లో రెవెన్యూ సిబ్బంది చిత్తశుద్ధి, అంకితభావం, సమర్థవంతంగా పనిచేస్తారనే గుర్తింపు ఉందన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కూడా అదేవిధంగా పనిచేయాలన్నారు. శాఖ ప్రతిష్ఠ దెబ్బతినేలా ఎవరైనా ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రధానంగా గ్రీవెన్స్‌లో 60శాతం వరకు రెవన్యూకు సంబంధించిన సమస్యలనే ప్రజలు ప్రస్తావిస్తున్నా విషయాన్ని గుర్తుచేశారు. తమ స్థాయిలో పరిష్కరించలేని సమస్యలైతే అదే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై తహసీల్దార్లకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలి

ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సిసోడియా ఆదేశించారు. కేవలం వీఆర్వో నివేదికపైనే ఆధారపడకుండా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు కూడా ఎప్పుడు మండలకేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. సర్వే శాఖలో తగినంత సిబ్బంది ఉన్నందున విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

నడకకు దారేది?



చెరువు కట్టపై వాకింగ్ చేస్తున్న మహిళలు

- చెరువు కట్టను వాకింగ్ ట్రాక్‌గా మార్చాలని సీనియర్ సిటిజన్ల విజ్ఞప్తి
- రోడ్డుపైనే ఉరుకులు, పరుగులు

మార్టూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గంటసేపు నడక.. గుప్పెడంత గుండెకు కొండంత బలమని డాక్టర్లు అంటారు. మరి 25వేల జనాభా కలిగిన మార్టూరు పట్టణంలో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడానికి సరైన స్థలం లేక నడక ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఉదయాన్నే జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీసు రోడ్లపై నడుస్తూ, పరుగెడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, కాలుష్యం కారణంగా సర్వీసు రోడ్లపై భయంగానే వారి నడకను కొనసాగిస్తుండగా, మరికొందరు నడక మానుకున్నారు.

వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది



రోడ్లపై భయంభయంగా నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మంచినీటి చెరువు కట్టపై నడవడం ఆనందంగా ఉంది. కాలుష్యం ఉండదు, చెట్ల గాలితో ఆహ్లాదకరంగా ఉంటుంది. చెరువు కట్టను వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తే చాలా మంచిది.

- పి.లక్ష్మి, ప్రభుత్వ టీచర్, మార్టూరు

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని

మార్టూరులో వాకింగ్ చేయడానికి మంచినీటి చెరువు కట్ట ఎంతో అనుకూలంగా ఉంటుంది. అయితే అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు గా చెరువు కట్టపై ప్రజలు నడవడానికి దారి అనుకూలంగా లేదు. వర్షం కురిసిందా చెరువు కట్టపై నడవడానికి అవకాశం లేదు. ఇక చెరువు కట్టపై గడ్డి ఉండడం, దారి ఎగుడు దిగుడుగా ఉండడంతో నడిచేవారికి సౌకర్యంగా లేదు. దానికి తోడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలు మడతపడి పడిపోయే ప్రమాదం ఉంది. చల్లటి వాతావరణం, చెరువు కట్ట అంచున పెరిగిన చెట్లు, చెరువులో నీళ్ల, కాలుష్యంలేని ప్రదేశం దాంతో చాలామంది వాకింగ్ కోసం చెరువు కట్టకు ఉదయం, సాయంత్రం వస్తుంటారు. ముఖ్యంగా సాయంత్రం వ్యక్తులతోపాటు రోజూ 20 మందికిపైగా మహిళలు వస్తుంటారు వారంతా సైనికుల్లాగా ఒకరి వెనుక మరొకరు నడవాల్సిందే. చెరువుకట్టపై ఒ క్కోచోట ఒక్కోరకంగా 10 అడుగులు నుంచి 15 అడుగులు పైనే విశాలంగా స్థలం ఉంది. కానీ వాకింగ్ ప్రియులు మాత్రం ఒకరి వెనుక మరొకరు నడుస్తూ ఫాలో అవ్వాల్సిందే.



చెరువు కట్టపై గడ్డి పెరగడంతో ఇరుకుగా ఉన్న దారి

వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి

చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుచేయాలని చాలాకాలం నుంచి ప్రజానీకం కోరుతున్నారు. ఆరోగ్యంపై దృష్టిసారించిన ప్రజలు వాకింగ్ చేయడానికి సరైన స్థలం లేక ఎంతోమంది వాకింగ్ చేయలేకపోతున్నారు. చెరువు కట్టను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరమని అంబేడ్కర్ నగర్, విద్యానగర్, రామ్‌నగర్ మద్దిసీతాదేవి, ఎన్టీఆర్‌నగర్ వాసులు అంటున్నారు. కట్టపై బల్లలు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తే సెలవు రోజుల్లో కుటుంబాలతో అక్కడ సేద తీరే అవకాశం కలుగుతుది.

రూ.20లక్షలతో ఉడాకు ప్రతిపాదన పంపాం

చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు రూ.20లక్షల వ్యయంతో తయారు చేసిన ప్రతిపాదనలు ఉడాకు పంపించాం. అదేవిధంగా ప్రస్తుతం వాకింగ్ చేసే ప్రజల కోసం చెరువు కట్టపై ఇబ్బందిగా ఉన్న గడ్డిని తొలగిస్తున్నాం.

- తన్నీరు శ్రీనివాసరావు, ఈవో మార్టూరు గ్రామపంచాయతీ

అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన చెట్టు కళేబరం, ప్రస్థానం కవితలు

నారాయణరావు, రాఘవరావును అభినందించిన సాహితీ సంస్థల ప్రతినిధులు



నారాయణరావు రాఘవరావు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అద్దంకికి చెందిన చందలూరి నారాయణరావు రాసిన చెట్టు కళేబరం, ఆర్‌వీ రాఘవరావు రాసిన ప్రస్థానం కవితలు అంతర్జాతీయ స్థాయిలో ఎంపిక కావడం జరిగిందని సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ కే.గీతమాధవి, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో వీక్షణం (సాహితీ గవాక్షం) కాలిఫోర్నియా వారు నిర్వహిస్తున్న 150వ సాహితీ సమావేశం సందర్భంగా ఓ ప్రత్యేక వచన కవిత్వ సంచిక నిమిత్తం దేశ, విదేశాల్లో ఉన్న 150 మంది తెలుగు కవుల నుంచి 150 కవితల్ని ఎంపిక చేశారు. అందులో అద్దంకికి చెందిన కవి చందలూరి నారాయణరావు రాసిన చెట్టు కళేబరం కవిత ఎంపిక అయింది. ఆర్వీ రాఘవరావు రాసిన ప్రస్థానం కవితలు ఎంపిక అయ్యాయి. శనివారం ఉదయం ఆన్‌లైన్ సమావేశంలో ఈ కవితలకు సంబంధించి కవి సమ్మేళనం, ప్రత్యేక వచన కవితా సంపుటి ఆ విష్కణ జరిగింది. ఈ సందర్భంగా కవులు తమ తమ కవితలను వినిపించారు. బాపట్ల జిల్లా సాహితీ స్రవంతి అధ్యక్షుడిగా పని చేస్తున్న చందలూరి నారాయణరావు అద్దంకి మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గతంలో నారాయణరావు రాసిన మనం కాసేపు మాట్లాడుకుందాం, మనిషి గుర్తుల్ని బతికించుకుందాం అనే కవితా సంపుటిలతో గుర్తింపు పొందారు. రాఘవరావు పోస్టర్ డిపార్టుమెంట్‌లో పని చేసి ఎన్నో సాహిత్య ప్రసంగాలు, సినీ సాహిత్య గురించి ఎన్నో వ్యాసాలు రాయడం ద్వారా గుర్తింపు కొందారు. అంతర్జాతీయ స్థాయిలో కవితలు గుర్తింపు పొందడం పట్ల కవులను సాహితీ విమర్శకులు అన్నమనేని వెంకట్రావు, డాక్టర్ వలివేటి సుబ్బారావు, డీవీఎం సత్యనారాయణ, గాడేపల్లి దివాకర్ దత్తు, ఇలపావులూరి శేషతల్పసాయి, మిట్టా కామేశ్వరశర్మ, శ్రీనివాసరావు అభినందించారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎం ప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ విధి విధానాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కని గిరి ప్రాంత వాసులు ఉపాధి లేక వలసలు వెళ్ళి జీవ నం సాగిస్తు న్నారన్నారు. కనిగిరిలో నిరుద్యోగులు ఉపా ధి, ఉద్యోగాలు లేకుండా ఖాళీగా ఉండకుండా చేసేందుకు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటుచేస్తు న్నట్లు చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చది విన నిరుద్యోగులు అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన రిజిస్ట్రేషన్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. తద్వార వారి విద్యార్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు.

కనిగిరి ప్రాంతంలో డయాలసిస్ రోగుల సంఖ్య నానాటికి పెరుగుతుండటంతో ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో సేవలందించేందుకు ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో దాతల సహకారంతో డయాలసిస్ కేంద్రంలో మరో పది మందికి డయాలసిస్ సేవలు అందించేందు కు చర్యలు తీసుకున్నారు.

సాగర్ ఆయకట్టులో పంటలపై సీఈ సమీక్ష

- మార్చి ఆఖరు వరకు నీరు అవసమని అధికారుల నివేదిక
- సరఫరాపై రేపటి కేఆర్ఎంబీ మీటింగ్ తర్వాత స్పష్టత

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సాగర్ ఆయకట్టులో ఉన్న పైర్ల పరిస్థితి, నీటి అవసరాలపై ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్(సీఈ) బి. శ్యాంబాబు జిల్లా ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. స్థానిక ప్రాజెక్టుల సీఈ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఈ బాలమురళీకృష్ణ, ఎస్‌ఈ వరలక్ష్మి, డిప్యూటీ ఎస్‌ఈ రామకృష్ణలతోపాటు పలుప్రాంతాల ఈఈలు పాల్గొన్నారు. ఒంగోలు సర్కిల్ పరిధిలో ఉన్న ఉమ్మడి జిల్లాలోని ఆయకట్టులో పంటల సాగు, ఇంకా నీటి అవసరం తదితర అంశాలపై మాట్లాడారు. ఇంకా రెండు లక్షల ఎకరాల వరకు పైర్లు పొలంలో ఉండగా మార్చి ఆఖరు వరకు 15 టీఎంసీల నీరు అవసరం పడతాయని కనీసం 9.50 టీఎంసీలు అయినా ఇవ్వాలని జిల్లా అధికారులు ఆ సమావేశంలో నివేదించారు. అయితే ఆ మేర నీరు సరఫరా అవకాశం లేదన్న సంకేతాలు ఉన్నత స్థాయి నుంచి ఉన్నట్లు చెప్పిన సీఈ ఈనెల 24న మరోసారి రెండు రాష్ట్రాల అధికారులతో కె ఆర్ఎంబీ సమావేశం ఉందని ఆ తర్వాత స్పష్టత వస్తుందని చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ వివాదం ముదరకముందు మార్చి ఆఖరులోపు రాష్ట్రానికి మరో 28 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర అధికారులు అంచనా వేసి స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల మధ్య సర్దుబాటు చేసుకుని వాడకం చేసుకోవాలని రెండు రోజుల క్రితం సూచించారు. ఆ విషయంలో ఎగువనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ 20 టీఎంసీలు వాడుకునేలా వారబంది అమలు చేపట్టి పక్షంరోజుల్లో 9 టీఎంసీలు ఉమ్మడి గుంటూరు, ఆరు రోజులు ఉమ్మడి ప్రకాశానికి నీరు ఇచ్చేలా షెడ్యూల్ రూపొందించారని తెలిసింది. దానిని జిల్లా అధికారులు వ్యతిరేకిస్తూ త్రిపురాంతకం సమీపంలోని 85/3 వద్ద నిరంతరం 2వేల క్యూసెక్కుల సరఫరా చేయాలని ఏబీసీ మీద వారబందీకి అభ్యంతరం లేదని చెప్పినట్లు తెలిసింది. అయితే మొత్తం వ్యవహారంపై కేఆర్ఎంబీ సోమవారం నిర్వహించే సమావేశంలో స్పష్టత రానున్నట్లు సమాచారం.

సాగర్ ఆయకట్టుకు నీటిగండం

- ఉమ్మడి జిల్లాలో 2లక్షల ఎకరాల్లో పైర్లు
- కీలక దశలో వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న
- మరో రెండు, మూడు తడులు తప్పనిసరి
- 15 టీఎంసీలకుపైగా నీరు అవసరం
- సగం కూడా ఇచ్చే అవకాశం లేని పరిస్థితి
- వర్షాల వేళ నీరిచ్చి.. ఇప్పుడు నియంత్రణ
- భారీగా నష్టపోనున్న రైతులు

ఉమ్మడి జిల్లాలోని సాగర్ ఆయకట్టు భూములకు నీటిగండం పొంచి ఉంది. పంట ఉత్పత్తులు చేతికి వస్తున్న ప్రస్తుత తరుణంలో మరో నెలన్నర పాటు పుష్కలంగా నీరు అవసరం. కాగా ఆ మేర సాగర్ నీరు సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దాదాపు 2 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న వంటి పైర్లు కీలక దశలో ఉన్నాయి. అవి చేతికి రావాలంటే కనీసం 15 నుంచి 18 టీఎంసీల నీరు అవసరంగా అంచనా. అయితే మార్చి ఆఖరులోపు అందులో సగం నీరు కూడా వస్తుందన్న గ్యారెంటీ కనిపించడం లేదు. అంతగా పొలాల్లో పైర్లు లేని వేళ గత సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు నీటిని ఇచ్చి ప్రస్తుతం అవసరమైన వేళ సరఫరాపై నియంత్రణ పెట్టారు.

ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం ముందుచూపు లేకపోవడం, అంతకు మించి రాష్ట్ర విభజన వల్ల సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో నీటివాడకంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నిత్యం తలెత్తుతున్న వివాదాలు ప్రస్తుతం నీటి ఇక్కట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

ఒంగోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగు నీటి వనరు సాగర్ కుడికాలువ. ఒంగోలు కేంద్రంగా ఉన్న జలవనరుల శాఖ సర్కిల్‌లో సుమారు 4.43 లక్షల ఎకరాల ఆయకట్టు ఎన్నెస్పీ పరిధిలో ఉంది. అందులో ప్రస్తుతం బాపట్ల జిల్లా భాగంలో లక్షా 71వేల ఎకరాలు ఉండగా మిగిలిన సుమారు 2.71 లక్షలు ప్రకాశం జిల్లాలో ఉంది. కాగా మొత్తం ఉమ్మడి జిల్లాలో 4.43 లక్షల ఎకరాలలో దీర్ఘకాలంగా నీరు అందని సుమారు లక్ష ఎకరాల చివరి భూముల రైతులు సాగర్ నీరు ఆధారంగా పంటలు సాగు ఎప్పటి నుంచో మానేశారు. మిగిలిన 3.50 లక్షల ఎకరాలలో 45శాతం మాగాణి, 55శాతం ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించిక పోవడం, వరిసాగు అంత లాభసాటిగా లేక సాగు విస్తీర్ణం తగ్గింది.



చుక్కనీరు లేకుండా చిల్లచెట్లతో నిండి ఉన్న రాజానగరం మేజర్ కాలువలు

ఇప్పటికే కోటా నీరు రాక

అధికారవర్గాల సమాచారాన్ని బట్టి 2.40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. అందులో 48 వేల ఎకరాల్లో మాగాణి సాగు కాగా మరో లక్ష 82వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు ఉన్నాయి. ఆరుతడి పంటలలో అత్యధికంగా పొగాకు, మిర్చి, వైట్‌బర్లీ, మొక్కజొన్న వంటివి ఉన్నాయి. కాగా సాగర్ కుడి కాలువకు డ్యామ్ నుంచి 132 టీఎంసీల నీటి వాటా ఉండగా అందులో ఉమ్మడి జిల్లాకు 43శాతం వంతున 57 టీఎంసీలు సరఫరా జరగాలి. ఆ ప్రకారం ఇప్పటికే 57 టీఎంసీల నీరు ఉమ్మడి జిల్లాకు వచ్చింది. అయితే పంటల సాగుకు నీరు అంతగా అవసరం లేని సెప్టెంబరు నుంచి నవంబరు వరకు అధికంగా నీరు సరఫరా చేశారు. అప్పట్లో శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లు నిండి గేట్లు ఎత్తి సముద్రానికి ఎక్కువగా నీటిని వదిలారు. అప్పట్లో ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు స్థానికంగా పంటలకు నీరు అవసరం అంతగా లేకున్నా కాలువలకు నీరు ఇవ్వడంతో చెరువులు, కుంటలు, వాగుల్లో నీటి ప్రవాహం జోరుగా సాగింది.

అందుబాటులో ఉంది 46టీఎంసీలే

గతంలో డ్యామ్‌లకు గేట్లు ఎత్తి నీటిని వదిలే సమయంలో ఇలా కాలువలకు నీరు వదిలితే వాటిని రాష్ట్ర నీటి కోటాలో లెక్కల్లోకి తీసుకోరాదన్న అనధికారిక ఒప్పందం రెండు రాష్ట్రాల మధ్య ఉండేది. అలాగే భావించి ఈ ఏడాది నీటిని సెప్టెంబరు సమయంలో ఇచ్చారు. అయితే ప్రస్తుతం సాగర్ డ్యామ్‌లో నీరు నిల్వ తగ్గింది. ప్రస్తుతం డ్యామ్‌లో 178 టీఎంసీలు మాత్రమే ఉండగా డెడ్‌స్టోరేజీ 132 టీఎంసీలు పోనూ నీరు రెండు రాష్ట్రాల సాగునీటి అవసరాలకు కలిపి ఇక 46 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. దీనికి తోడు ఆంధ్ర రాష్ట్రం భారీగా సాగర్ నీటిని తోడేస్తున్నదని తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు అక్కడి ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. దీంతో నీటిలో వాడకం లెక్కలపై తెలంగాణ ప్రభుత్వం కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)పై వత్తిడి తెస్తోంది. దీంతో ఏపీకి అధికారికంగా 132 టీఎంసీలు వాడుకునే హక్కు ఉండగా ఇప్పటికే ఆ కోటా వాడారన్న లెక్కలు కట్టారు. ఆ ప్రభావం ప్రస్తుత సీజన్‌లో పొలంలో ఉన్న పంటలకు తదుపరి నీటి సరఫరాపై తీవ్రంగా ఏర్పడింది.



ముండ్లమూరు మండలం వేములబండ ప్రాంతంలో నెర్రలు ఇచ్చిన వరి పంట భూములు

పెద్దగా రాకపోవచ్చు

కేఆర్ఎంబీపై తెలంగాణ వత్తిడితో రాష్ట్రానికి ఇక పెద్దగా సాగర్ నీరు సరఫరా ఉండవకపోవచ్చన్న సంకేతాలు ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఇరిగేషన్ అధికారులకు అందాయి. మార్చి ఆఖరు వరకు అతి తక్కువ నీరు మాత్రమే వస్తుందని దానికి అనుగుణంగా నియంత్రణ చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలు అందడంతో తదనుగుణ కసరత్తును ప్రస్తుతం ఇక్కడి అధికారులు చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పొలంలో ఉన్న పంటల నీటి అవసరాల ప్రకారం పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాకు మార్చి ఆఖరులోపు కనీసం 15నుంచి 18 టీఎంసీల నీరు అవసరం. అయితే అందులో సగం మించి వచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈ ఏడాది జిల్లాలో ప్రత్యేకించి రామతీర్థం దిగువ ప్రాంతంలోని ఎస్ఎన్‌పాడు, కొండపి, ఒంగోలు, దర్శి నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 50వేల ఎకరాల్లో పొగాకు లేత తోటలు ఉన్నాయి. వాటికి కనీసం మూడు తడుల నీరు అవసరం.

వారబందీ అమలుకు ఆదేశం

ఇక రామతీర్థం నుంచి దర్శితోపాటు వైపాలెం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మిర్చి, వరి, మొక్కజొన్న ఉండగా బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో మిర్చి, మొక్కజొన్న, బర్లీ పొగాకు అధికంగా ఉంది. వీటన్నింటికి దాదాపు రెండు మాసాలు నీరు అవసరం. పలుచోట్ల శనగ పంటకు కూడా తడులు అవసరంగా కనిపిస్తోంది. ఆ ప్రకారం 15 నుంచి 18 టీఎంసీల నీరు అవసరం కనిపిస్తుండగా 8 టీఎంసీలు మించి ఇచ్చే అవకాశం లేదన్న సంకేతాలు ఉన్నత స్థాయి నుంచి జిల్లా అధికారులకు అందాయి. ఆ మేరకు వారబందీ అమలు, ఇతర నీటి నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఏమి చేయాలన్నది అర్థం కాక ఇక్కడ ఇరిగేషన్ అధికారులు తలల పట్టుకుంటున్నారు. నీటి నియంత్రణపై ఇప్పటికే కలెక్టర్ అన్సారియా రెండు రోజుల క్రితం సమీక్ష చేయగా శనివారం ప్రాజెక్టుల సీఈ జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. అయితే అవసరానికి సరిపడా నీరు సరఫరా అవకాశం మాత్రం కనిపించకపోతుండగా ఏదైనా అకాల వర్షం పడితేనే తప్ప రైతులకు నీటిగండం తప్పేటట్లు లేదు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వరిగడ్డి వామి దగ్ధం

అద్దంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వరిగడి వామి దగ్ధమై సుమారు రూ.20వేల ఆస్తి నష్టం జరిగింది. పట్టణంలోని కలవకూరు రోడ్డులో కొత్తదామావారిపాలెంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దామా కల్యాణ చక్రవర్తికి చెందిన వరిగడ్డి వామి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు.

27న మునిసిపల్ సాధారణ సమావేశం

అద్దంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మునిసిపల్ సాధారణ సమావేశం ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ చాంబర్‌లో చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు. మొత్తం 46 అంశాలతో అజెండా రూపొందించారు.

టిడ్కో కోసం ఎదురుచూపులు


శింగరకొండ సమీపంలో అసంపూర్తి పనులతో నిలిచిపోయిన టిడ్కో ఇళ్లు


ఎక్కువ శాతం పనులు పూర్తయిన బ్లాక్‌లు

- 80 శాతం నిర్మాణ పనులు ఆరేళ్ల కిందటే పూర్తి
- గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఆ ఇళ్లన్నీ గాలికి
- మంజూరు కాని జగనన్న కాలనీలు
- కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల్లో ఆశలు

అద్దంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి కుటుంబాల లబ్ధిదారుల సొంతింటి కల నెరవేర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్మించింది. అద్దంకి పట్టణంలోని 960 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 97 రద్దు కావడంతో 863 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పలు సార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావుడి చేసినా ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడ లేదు. దీంతో 5 సంవత్సరాల పాటు ఎలాంటి పనులూ జరగలేదు. అదే సమయంలో టిడ్కో లబ్ధిదారులకు వైసీపీ చేపట్టిన జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు కూడా మంజూరు కాలేదు. దీంతో లబ్ధిదారుల పరిస్థితి రెండిటికీ చెడ్డ రేవడిలా మారింది. ఇలా 5 సంవత్సరాలు గడిచింది. 9నెలల కిందట టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులలో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం కూడా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని ప్రకటించడంతో ఆనందపడ్డారు. అయితే ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో లబ్ధిదారులు ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు. అద్దె ఇళ్లల్లో ఉంటూ కాలం వెల్లదీయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

అసభ్య పోస్టులపై చర్యలు తీసుకోండి

చీరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సోషల్ మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ప్రజా సేవల్లో ముందుంటూ నిరంతరం శ్రమిస్తూ ఉన్నతమైన స్థానంలో ఉన్న వ్యక్తిపై అసభ్య పోస్టులు చేయడం హేయమన్నారు. సంబంధిత ఆధారాలను పోలీసులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గూడూరి శివరామప్రసాద్, పాలవలస శ్రీనివాస్, మామిడాల శ్రీనివాసరావు, కిషోర్, కిరణ్, రామారావు, లక్ష్మి, కోటేశ్వరి, వీరమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

డీఎస్పీ మొయిన్


పల్లెనిద్రలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఈ విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక వైపె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత అపరిచితుల నుంచి దూరం పాటించాలన్నారు. అలాగే డిజిటల్ లావాదేవీల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈపూరుపాలెం పంచాయతీ సావరపాలెంలో పల్లెనిద్ర కార్యక్రమం జరిగింది. సీఐలు శ్రీనివాసరావు, ఎస్సై చంద్రశేఖర్ కళాశాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగి ఆత్మహత్య

అద్దంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ సొసైటీ లో ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడ్డారు. అద్దంకి పట్టణంలోని అభ్యుదయనగర్‌లో నివాసం ఉండే సహకారం సంఘం ఉద్యోగి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసి బంధువులు వైద్యశాలకు తీసుకు వెళ్లగా మృతి చెందారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

అద్దంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా ఆయా కేంద్రాలలో బిల్లులు చెల్లించేందుకు వీలుగా తెరిచి ఉంచుతున్నట్లు అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తానరావు ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి డివిజన్ పరిధిలోని అన్ని మండలాలతో పాటు పట్టణంలోని ఈఆర్‌వో కార్యాల యాల్లో బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

గురువుల సూచనలను పాటించాలి

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో గురువులు బోధించిన అంశాలను తప్పక పాటించడం వలన ఉన్నతంగా రాణిస్తారని వేటపాలెం మండలం అక్కయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భవనం బద్రిరెడ్డి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ, సరస్వతి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏడాదంతా బోధించిన అంశాలను జీవితంలో ఉపయోకరంగా మలుచుకుని లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అనూరాధ, శ్రీనివాసరెడ్డి, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం, రమణ, విద్యా కమిటి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతి పూజ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సమస్యల పరిష్కారంలో సమన్వయంతో సాగండి

ఎమ్మెల్యే కొండయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సిబ్బందితో కలిసి సమన్వయంతో సాగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం మునిసిపల్ సమాశం హాలులో నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి నిరంతరం శ్రమించాలని సూచించారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సేవలందించాలన్నారు. అనంతరం అధికారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. దీంతో అర్జీదారులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఎమ్మెల్యే వారి నుంచి అర్జీలు స్వీకరించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, పార్వతి సిబ్బంది, టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ


మహిళలకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న శంకర కంటి ఆస్పత్రి వైద్యులు

మార్టూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం శంకర కంటి ఆస్పత్రి వైద్యులు కంటి ఆపరేషన్లు చేయించుకున్నవారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. గత నెల 26వతేదీన ఎమ్మెల్యే ఏలూరి జన్మదినం సందర్భంగా నోవా అగ్రి గ్రూప్స్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రివారు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి కంటి ఆపరేషన్లు చేశారు. వారందరికీ శనివారం క్యాంపు కార్యాలయంలో వైద్యులు మరోసారి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టరు చింతన్‌తో పాటు టీడీపీ నాయకులు తేలప్రోలు సాంబశివరావు, మిన్నెకంటి రవికుమార్, క్యాంపు కార్యాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.


తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే చట్ట పరమైన చర్యలు తప్పవని వేటపాలెం తహసీల్దార్ పార్వతి అన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట సర్వే నెంబర్ 360లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం తవ్వకాలు జరగడం లేదని చెప్పారు. అక్రమార్కులపై నిరంతరం నిఘా ఉంచినట్లు తహసీల్దార్ వివరించారు.

సారాకు దూరంగా ఉండండి



నవోదయం 2.0పై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చీరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సారా, కొకైన్ తదితరాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని శనివారం మండల పరిధిలోని కొత్తపాలెం, వాడరేవు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు సారా, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఆయా ప్రాంతాల గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈ చెత్త కనపడలేదా?

- ఫొటోలకే పరిమితమైన సేకరణ కార్యక్రమం
- కార్యాలయాలు, రోడ్లవెంట కుప్పలుగా దర్శనం


ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న చెత్త

బల్లికురవ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రతి ఇంటి నుంచీ తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో శనివారం తెల్లవారుజాము నుంచే అన్ని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి ఇంటింటికీ వెళ్లి వాహనాల ద్వారా చెత్తను గ్రామానికి దూరంగా తరలించే పనులు చేపట్టారు. కానీ ఇక్కడ అధికారులు మా త్రం రోడ్ల వెంబడి అపారిశుధ్యంగా ఉన్న చెత్త సంగతి మాత్రం మరిచారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న చెత్త విషయాన్నీ పట్టించుకోలేదు. దీం తో ఎక్కడిచెత్త అక్కడే తాండవిస్తోంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చెత్తను ఒక మూలకు చేర్చి ఉంచారు. కొప్పెరపాడు నూతన సచివాలయం వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలు, మద్యం బాటిళ్లు అక్కడే ఉన్నాయి. చెన్నుపల్లి రోడ్డులో చెత్త తిష్ఠ వేసి ఉంది. చెత్త సేకరణ కార్యక్రమం ఫొటోలకే పరిమితమైందని ప్రజలు వి మర్శిస్తున్నారు. చెత్త సేకరణ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కొప్పెరపాడు నూతన సచివాలయం వద్ద ఉన్న వ్యర్థాలు


కొప్పెరపాడు రోడ్డు వెంబడి ఉన్న చెత్త


చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలి

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో వీధులు పరిశుభ్రంగా ఉంచాలని, విధిగా చెత్త సేకరణ జరగాలని వేటపాలెం ఎంపీడీవో రాజేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్త నిల్వలు నిర్దేసించిన ప్రాంతాల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అన్నం శ్రీనివాసరావు, పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

బల్లికురవ : పరిసరాల పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని ఈవోపీఆర్డీ సుమతి కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం గ్రామాలలో ప్రతి ఇంటి నుంచీ చెత్త సేకరణ చేసే కార్యక్రమాన్ని సుమతి అంబడిపూడి, మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, వల్లాపల్లి, గొర్రెపాడు, వేమవరం, వైదన గ్రామాలలో పరిశీలించారు. ఈసందర్భంగా చెత్త సేకరించే వారితో ఆమె మాట్లాడుతు ప్రజలు వేసే చెత్తను గ్రామానికి దూరంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మీరావలి, అనిల్, ప్రసాద్‌రెడ్డి, ప్రసాదరావు, వెంకట్రావు, నూర్ అహ్మద్ ఉన్నారు.

మేదరమెట్ల : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఆర్.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం పారిశుధ్య పనులను చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాలల్లో మూడవ శనివారం శుభ్రం చేయాలని సూచించారు.

వామ్మో వీధి కుక్కలు

- రోడ్లు, వీధుల్లో విచ్చలవిడిగా సంచారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కొమ్మినేనివారిపాలెంలో తిరుగుతున్న వీధి కుక్కలు

బల్లికురవ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నారు. గతంలో కొద్దిగా ఉండే కుక్కలు ఇప్పుడు ఒక్కో గ్రామంలో వందల సంఖ్యలో ఉన్నాయి. రాత్రుళ్లు కుక్కల గుంపును చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాహనాల వెంబడి పడుతుండడంతో పలువురు ప్రమాదాలబారినపడుతున్నారు. మండలంలోని కొమ్మినేనివారిపాలెం, బల్లికురవ, ముక్తేశ్వరం, వల్లాపల్లి, కొప్పెరపాడు గ్రామాలలో ఇటీవల వీధి కుక్కల దాడిలో పలువురు గాయాలపాలయ్యారు. పశువులు, గొర్రెలకూ కుక్కల బెడద ఎక్కువైందని పోషకులు చెప్తున్నారు. వారం రోజులకిందట ముక్తేశ్వరంలో వీధి కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి చెందాయి. పంచాయతీ అధికారులు మాత్రం వీధి కుక్కలను చంపడం నేరమంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో కుక్కల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. అధికారులు వెంటనే గ్రామాలలో ఉన్న వీధి కుక్కలకు గర్భం రాకుండా ఇంజక్షన్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శిని కరిచిన కుక్క

తాజాగా మండలంలోని వల్లాపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శనివారం విధులలో భాగంగా గ్రామానికి రాగా వీధి కుక్క ఆయన కాలిని కరిచింది. వెంటనే పంచాయతీ కార్యదర్శిని గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వ్యాక్సిన్‌లు అందించారు.

ఆటోను ఢీకొన్న లారీ

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు


ఆగి ఉన్న ఫోర్‌వీలర్ ఆటోను ఢీకొన్న లారీ

పంగులూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఫోర్ వీలర్ ఆటోను వెనుకవైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. శుక్రవారం అర్ధరాత్రి బైటమంజులూరు సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. అద్దంకి మండలం వెంకటాపురం నుంచి పొగాకు లోడుతో మార్టూరు వైపు వెలుతున్న ఫోర్ వీలర్ ఆటో టైరు పంచర్ కావడంతో బైటమంజులూరు సమీపంలో జాతీయ రహదారిపై ఆగిపోయింది. అదే సమయంలో మైసూరు నుంచి భువనేశ్వర్ వెలుతున్న లారీ ఆగి ఉన్న ఆటోను వేగంగా ఢీకొనడంతో ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో లారీ నడుపుతున్న బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది డ్రైవర్ బాలకృష్ణను వైద్య చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణంగివరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడు మృతి


ప్రసాద్ (ఫైల్)

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గుండె పోటులో బస్సులో ప్రయాణిస్తున్న కారంచేడుకు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కారంచేడు గ్రామానికి చెందిన జాగర్లమూడి శివరాం ప్రసాద్(50) హైదరాబాద్ నుంచి ప్రైవేటు బస్సులో స్వగ్రామానికి వస్తున్నారు. బస్సు హైదరాబాద్ నుంచి కారంచేడు మీదుగా చీరాల చేరుకున్న అతను బస్సులో నుంచి దిగక పోవడంతో బస్సు సిబ్బంది గుర్తించి లేపే ప్రయత్నం చేశారు. ఉలుకుపలుకు లేకపోవడంతో బస్సును నేరుగా పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.. అక్కడ నుంచి పోలీసులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రసాద్‌కు భార్య కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రస్తుతం ఉన్నత చదువుల కోసం అమెరికాలో ఉన్నారు. అతని సోదరులు జాగర్లమూడి రంగనాయకులు సెబీలో కీలక స్థానంలో ఉన్నారు. ఆయన మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

కేసరిపై ఈశ్వరా..!



సింహ వాహనంపై మూలస్థానేశ్వరుడు

నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల హర నామస్మరణతో నగరోత్సవం సాగింది. ఉదయం ధ్వజారోహణను అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ నంది పటం ధ్వజాన్ని అధిరోహించింది. ఈ సందర్భంగా సంతానం లేని మహిళలకు కోడిముద్దలు పంచిపెట్టారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

ఆలయాల ఆదాయాన్ని బట్టి కేటగిరీల మార్పు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల ఆదాయ వనరులను బట్టి కేటగిరిలను మారుస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జీవో ప్రకారం 6సీ కేటరిగి ఆలయాలకు ఆదాయం రూ.2లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచింది. 6బీ ఆలయాల ఆదాయం రూ.15లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచింది. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.2కోట్లకు పెంచింది. ఈ జీవో కారణంగా నెల్లూరు నగరంలోని సర్వోదయ కళాశాల(ఆలయ ట్రస్టు పరిధిలోనిది కాబట్టి) 6ఏ కేటగిరి నుంచి 6బీ కేటగిరికి చేరింది. అలాగే గతంలో జిల్లాలో 36 ఆలయాలు 6బీలో ఉండగా, కొత్త జీవోతో 33 ఆలయాలు 6సీ కేటగిరిలో చేరాయి. ఈవోల పర్యవేక్షణలో ఉండే ఆలయాల కేటగిరిలు మాత్రం యథాతథంగా ఉన్నాయి.

మదనపల్లె టమోటా సింహపురిలో..

● పది టన్నుల దిగుమతి ● రైతుబజార్లలో విక్రయాలు ● రేపటి నుంచి కాయగూరలు కూడా..




నవాబుపేట రైతుబజారులో టమోటా విక్రయాన్ని పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత కుమారి



నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : టమోటా ధర పడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న కర్షకులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఉత్పత్తి అవుతున్న టమోటాలను జిల్లా అవసరాలకు శనివారం 10 టన్నులు దిగుమతి చేసుకుని జిల్లాలోని రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. నగరంలోని రైతుబజార్లను మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత కుమారి పర్యవేక్షించి, మాట్లాడారు. టమోటా ధరలు బాగా పడిపోయిన నేపథ్యంలో రైతులకు కనీసం పెట్టుబడి దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దళారులు కూడా వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని దీన్ని నివారించేందుకు రైతు వద్దే నేరుగా కొనుగోలు చేసి రైతుబజార్లలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. రైతులు కూడా వారు పండించిన కూరగాయలను నేరుగా రైతుబజార్లలో అమ్ముకునే అవకాశం ఉందని చెప్పారు. అలా కాని పక్షంలో మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి కూరగాయలను సేకరించి రైతుబజార్లలో ఆరోజు మార్కెట్ ధరకు విక్రయించడం జరుగుతుందన్నారు. శనివారం నెల్లూరులోని పత్తేఖాన్‌పేట, నవాబుపేట, పొదలకూరు, కందుకూరు, కావలి రైతుబజార్లలో కిలో 13-15 చొప్పున టమోటాలు విక్రయించారు. సోమవారం నుంచి స్థానిక రైతులు పండిస్తున్న కాయగూరలను కూడా రైతుబజార్లలో విక్రయించనున్నట్లు చెప్పారు.

నేడు సీఎం పర్యటన : పటిష్ట బందోబస్తు



నెల్లూరు (హరనాధపురం/క్రైం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం నెల్లూరుకు రానున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 10.55 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 11.10 గంటలకు రేణిగుంటలో ఉన్న ఆర్వీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఓ వివాహానికి హాజరవుతారు. 11.45 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.10గంటలకు నెల్లూరులోని కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి గొలగమూడి రోడ్డులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడి వివాహ వేడుకలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. తిరిగి 12.55 గంటలకు వీపీఆర్ కన్వెన్షన్ నుంచి బయలుదేరి హెలికాప్టర్ ద్వారా తిరుపతి విమానాశ్రయానికి వెళతారు.

● 902 మందితో బందోబస్తు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా 902 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తును ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఒకరు, డీఎస్పీలు ఏడుగురు, సీఐలు 26 మంది, ఎస్ఐలు 60, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు 169, కానిస్టేబుళ్లు 266, మహిళా ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 79, హోమ్‌గార్డులు 120 మంది, స్పెషల్ పార్టీ సిబ్బంది 54, ఏఆర్ సిబ్బంది 120 మొత్తం 902 మందితో బందోబస్తు విధుల్లో ఉంటారు. వీపీఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం పోలీసు అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయి బందోబస్తును మ్యాప్ ద్వారా ఎస్పీ క్షుణ్ణంగా వివరిస్తూ బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా సున్నితంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలు నిలుపుకునేలా చూడాలన్నారు. అనంతరం కాన్వాయి ట్రయల్ రన్ నిర్వహించారు. బ్రీఫింగ్‌లో అదనపు ఎస్పీ (ఏఆర్) మునిరాజ, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ క్రిష్టారావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్‌యూ అభివృద్ధికి కృషి చేస్తా

● నూతన వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం కుటుంబ సభ్యులు, గురువుల సమక్షంలో వీసీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో వీఎస్‌యూ ప్రధాన భూమిక వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచేలా అత్యుత్తమ విద్యను అందించేందుకు వర్సిటీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వీఎస్‌యూ అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, ప్రొఫెసర్లు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అల్లం శ్రీనివాసరావు గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంతోపాటు కాకుటూరు సమీపంలో ఉన్న అడవిలోని శివాలయాన్ని దర్శించుకున్నారు.



వీసీ అల్లం శ్రీనివాసరావుతో రిజిస్ట్రార్ సునీత, ప్రొఫెసర్లు



సంగం : కొరిమెర్ల రోడ్డులోని రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

జిల్లాకు 30 లక్షల గోనె సంచులు

● తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు
● మా దృష్టికి వస్తే మిల్లర్లపై చర్యలు
● రేపటికల్లా ధాన్యం రవాణా బిల్లుల మంజూరు
● ఉపాధి నిధులతో సిమెంట్ ప్లాట్‌ఫారాలు
● కౌలురైతులకూ ప్రభుత్వ రాయితీలు
● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

సంగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు రవాణా ఖర్చులు రూ.1.4 కోట్లు ఇవ్వాలని జేసీ చెప్పారు. సోమవారానికల్లా రైతుల ఖాతాల్లో ఆ నగదు జమ అయ్యేలా చూస్తా'నని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. శనివారం మండల కేంద్రమైన సంగంలో పీఏసీఎస్‌లో రూ.20.5 కోట్లతో నిర్మించిన గోదాము భవనం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులతో జరిగిన ముఖాముఖిలో మంత్రి మనోహర్ రైతులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు. 'ఖరీఫ్ సీజన్‌లో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 5.13 కోట్ల గోనె సంచులు కొనుగోలు చేశాం. ఇప్పుడు జాయింట్ కలెక్టర్‌ను అడిగితే జిల్లాకు 30 లక్షల గోనె సంచులు, సంగం పీఏసీఎస్‌కు ప్రస్తుతం 15 వేల గోనె సంచులు కావాలని చెప్పారు. ఆ మేరకు జిల్లాకు కొత్త గోనె సంచులు సరఫరా చేయిస్తా. అలాగే పెండింగ్‌లో ఉన్న రవాణా బిల్లులు కూడా రేపటికల్లా మంజూరు చేస్తాను. తేమ శాతం విషయంలో రైతులు సందేహం అవసరం లేదు. మిల్లర్లతో మాట్లాడాం. రైతు సేవా కేంద్రంలో తేమశాతం ఎంత వస్తుందో మిల్లర్లు దాన్నే ప్రామాణికంగా తీసుకోవాలి. మిల్లర్లు ఇబ్బంది పెట్టినట్లు మా దృష్టికి తేస్తే అటువంటి మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. కల్లాల విషయంలో ప్రభుత్వం రాబోవు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ నిధులతో ప్రభుత్వ స్థలాల్లో సిమెంట్ ప్లాట్‌ఫారాల ఏర్పాటుకు వచ్చే ఖరీఫ్ సీజన్‌కు చర్యలు చేపడతాం. పంచాయతీ గ్రామసభలో తీర్మానిస్తే కౌలు రైతులు గుర్తింపు కార్డు ఇచ్చి అన్ని ప్రభుత్వ రాయితీలు వర్తించేలా త్వరలో చర్యలు చేపట్టతామని తెలిపారు.

● బ్యారేజిని హైవేకు అనుసంధానించాలి



సంగంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన మరో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, జేసీ కార్తీక్ తదితరులు

మంత్రి ఆనం మాట్లాడుతూ సంగం బ్యారేజీని జాతీయ రహదారికి అనుసంధానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోపాటు మంత్రి నాదేండ్ల మనోహర్ సహకారం అవసరమని కోరారు. అందుకు రూ. 75 కోట్లు అవసరమని గుర్తించామని సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. సంగంలో ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమం కోసం నిర్మించిన భవనాలు ప్రభుత్వ ఐటీఐకి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, దాతల పేరుతో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి కోరుతున్నారన్నారు. అది జరిగితే సంగంలో సిల్క్ సెంటర్ ఏర్పాటుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి కూటమి ప్రభుత్వం నెల్లూరు రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం కొరిమెర్ల రోడ్డులో ఉన్న రైస్ మిల్లును మంత్రులు తనిఖీ చేశారు. ధాన్యం సేకరణలో ఉన్న ఇబ్బందులపై మిల్లు యజమానితో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి, రైతులకు మధ్య మిల్లర్లు వారధిగా ఉండాలి కానీ వ్యాపార ధోరణిలో చూడకూడదని సూచించారు. మంత్రుల వెంట జేసీ కార్తీక్, ఆర్డీవో పావని, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ హజీజ్, రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్, సివిల్ సప్లయి డీఎం అర్జునరావు, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అంతకముందు వీరు బుచ్చిరెడ్డిపాళెంలో పర్యటించారు.

● ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తాం



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నెల్లూరు (హరనాథపురం) : రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సమీక్షించారు. అధికారులంతా రాబోయే 2 నెలలు కష్టపడి పనిచేసి రైతాంగానికి మేలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేస్తామని రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. మంత్రి ఆనం సూచనల మేరకు బ్యాంకు గ్యారెంటీలు అందజేసి, రైస్‌మిల్లర్ల భాగస్వామ్యంతో రైతాంగానికి మేలు చేకూరే విధంగా చర్యలు చేపడుతామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల సహకారం గురించి, వారి సమస్యల గురించి విచారించారు. సేకరించిన సన్నబియ్యాన్ని రాబోయే రోజుల్లో పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగిస్తామన్నారు. ఎండీయూ ఆపరేటర్ల విషయంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వెంటనే తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ క్రాప్ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జేసీ స్థాయి నుంచి కిందిస్థాయి అధికారి వరకు అంతా కష్టపడి పనిచేసి రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, పౌర సరఫరాల డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ రంగయ్యనాయుడు, సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కేశవచౌదరి, పౌరసరఫరాల శాఖ డీఎం అర్జున్, డీఎస్‌ఓ అంకయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-2 పరీక్ష

● జిల్లాలో ఏడు కేంద్రాల్లో నిర్వహణ
● వదంతులు నమ్మొద్దు : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం (నేడు) ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఏడుకేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్షను నిర్వహిస్తారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు వీఆర్ పీజీ స్టడీస్, నెల్లూరు ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వెంకటాచలం సమీపంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ధనలక్ష్మీపురంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్, నెల్లూరు రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు. పేర్కొన్నారు. ఈ కేంద్రాలకు లైజనింగ్ అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 4102 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జెరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరుచుకోకుండా, 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నామన్నారు. సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రంలోని డిపాజిట్ సెంటర్‌లో డిపాజిట్ చేయాలని తెలిపారు.

● కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఈ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లోని 0861 2331261 నెంబరుకు ఫోన్ చేసి అభ్యర్థులు తమ సమస్యలు తెలియచేయవచ్చని, ఇతర వివరాలు కూడా పొందవచ్చని తెలిపారు.

● వదంతులు నమ్మొద్దు

ఆదివారం (నేడు) గ్రూప్-2

- మిగతా 6లో..

బీమా లేదు రామా!

● పేదలకు అందని బీమా పథకం
● ఇంటిపెద్ద మరణిస్తే ఆర్థిక సంక్షోభం
● గత టీడీపీ ప్రభుత్వంలో 'చంద్రన్న బీమా'
● వైసీపీ పాలనలో మార్పులు
● పరిష్కరించని క్లెయిములు
● ఇప్పటికీ సుమారు రూ.2 కోట్లు పెండింగ్
● ఎన్నికల అనంతరం పూర్తిగా నిలిపివేత
● ఇప్పటికే సుమారు 700 మంది నమోదు
● పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కసరత్తు?

6లో..

జీవిత బీమా కుటుంబానికి ధీమా అనేది ఆధునిక సమాజంలో అందరికీ వర్తించే సూత్రం. ముఖ్యంగా పేదల కుటుంబాల్లో ఇంటి పెద్ద ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబాల పరిస్థితి ఒక్కసారిగా తలకిందులవుతుంది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి లేకపోతే ఆర్థికంగా చితికిపోతాయి. ఆ ప్రభావం పిల్లల చదువుపై, జీవన ప్రమాణాలపై పడుతుంది. ఒకప్పుడు ఇలాంటి కుటుంబాలకు ప్రభుత్వ బీమా పథకం కొంత వరకైనా భరోసానిచ్చేది. మరణించిన వెంటనే మట్టి ఖర్చులకు, ఆపై కుటుంబ సభ్యులకు బీమా నగదు లభించేది. కానీ, సుమారు ఏడాది కాలంగా ఈ పథకం అమలు కాకపోవడం, అంతకు ముందు వైసీపీ పాలనలో అలక్ష్యం కారణంగా వందలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం కరుణిస్తుందని ఎదురుచూస్తున్నాయి.

ఓయమ్మ.. దానిమ్మ!

● 'కండలేరు' కింద మిస్టరీగా తోటలసాగు
● టీజీపీ, అక్రమార్కుల మిలాఖత్
● 30 ఏళ్ల తర్వాత కూడా పరిహారానికి కేసులు
● ఇప్పటికే రూ.వందల కోట్ల చెల్లింపు
● ఈ కథేమిటో తేల్చాలని ఉద్యాన వర్సిటీకి లేఖ
● అయినా స్పందించని వర్సిటీ యంత్రాంగం

వివరాలు 7



తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ) భూసేకరణ విభాగంలో కొందరు అధికారులు, అక్రమార్కులు మిలాఖత్ అయ్యారు. జిల్లాలో సాగేకాని దానిమ్మ తోటలు కండలేరు జలాశయం నిర్మాణం జరిగిన ప్రాంతంలో వేల ఎకరాలు ఉన్నట్టు రికార్డులు సృష్టించారు. ఇంకేముంది... రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని పరిహారం రూపంలో చెల్లించడం... ముప్పై ఏళ్ల తర్వాత కూడా ఇంకా తమకు పరిహారం సరిపోలేదంటూ కేసులు వేయడం పరిపాటిగా మారుతోంది. తాజాగా ఓ వ్యక్తికి రూ.70 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. మరి కొందరు కూడా ఇదేమార్గంలో రూ.కోట్లు రాబట్టుకునేందుకు జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.



శ్రీనివాస కల్యాణ వైభోగం



నెల్లూరులోని నిప్పో కర్మాగారం ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాస కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీనివాస కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో శనివారం ఉదయాస్తమాన సేవలు నిర్వహించారు. శ్రీనివాస వజ్ర కవచ మహాయాగం, మహా పూర్ణాహుతి జరిగాయి. సాయంత్రం నగరోత్స వం అనంతరం దేవదేవుని కల్యాణోత్స వాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆ తర్వా త పుష్పయాగం భక్తజనానికి కనువిం దు చేసింది. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణ, అన్నమయ్య కీర్తనలతో పరిసరాలు మారు మోగాయి. ఈ కార్యక్రమాలను శ్రీనివాస కల్యాణ కమిటీ వ్యవస్థాపకుడు చెక్కా సునీల్, 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్కా అహల్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)



1బీ, అడంగల్ ఇవ్వండి

ఉదయగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రీసర్వే లో జరిగిన తప్పిదాల వల్ల మండలంలోని పలువురు రైతులకు 1బీ, అడంగల్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు సత్వరమే చర్యలు చేపట్టి ఆన్‌లైన్‌లో వచ్చేలా చూడాలని శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ 1బీ, అడంగల్ రాకపోవడంతో రైతులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆన్‌లైన్‌లో వారికి సంబంధించిన భూవివరాలు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, నాయకులు నాయబ్, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీమా లేదు రామా..!

● పేదలకు అందని బీమా పథకం ● 'చంద్రన్న బీమా' పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కసరత్తు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బీమా పథకం అమలులో లేకపోవడంతో ఎన్నో పేద కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయి. పేదలకు ఈ పరిస్థితి రాకూడదన్న ఉద్దేశంతో 2016 అక్టోబరు 2వతేదీన నాటి తెలుగు దేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని ప్రారంభించింది. 18 నుంచి 70 ఏళ్లలోపు నిరుపేదలందరికీ ఈ పథకాన్ని వర్తింపజేసిం ది. ఏడాదికి కేవలం రూ.15 చెల్లిస్తే సరిపోయేది. 18 నుంచి 50 ఏళ్లలోపు వారు సహజ మరణం చెందితే బాధిత కుటుంబానికి రూ.2లక్షలు, 51 నుంచి 60 ఏళ్ల మధ్య వారు మరణిస్తే రూ.30 వేలు, అంగవైకల్యం ఏర్పడితే రూ.2.5లక్షలు వంతున పరిహారం చెల్లించేవారు. మృతి చెందిన లేదా ప్రమాదం జరిగిన రోజు నుంచి రెండు వారాల్లో బాధిత కుటుంబాలకు చెక్కు రూపంలో పరిహారం అందించేవారు. బీమా మిత్రల ద్వారా ఈ పథకాన్ని అమలు చేసింది. బీమా చేసిన వ్యక్తి మరణిస్తే వారి వివరాలను రెండు గంటల్లో రిజిస్ట్రేషన్ చేసి, ఆరు గంటల్లో బాధిత కుటుంబం దగ్గరికే బీమా మిత్రలు వెళ్లి మట్టి ఖర్చుల కింద రూ.5వేలు చెల్లించే వారు. అనంతరం మరణించిన వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలను రెండు రోజుల్లో నమోదు చేసేవారు. ఈ విధానంలో ఒక్కొక్క క్లెయిమ్ నమోదు చేసినందుకు బీమా మిత్రలకు రూ.250 నుంచి రూ.500 వంతున ప్రభుత్వం చెల్లించేది.

● వైసీపీ పాలనలో కుదింపు.. పెండింగ్

వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. చంద్రన్న బీమా పథకాన్ని వైఎస్ఆర్ బీమా పథకంగా పేరు మార్చడమే కాకుండా పరిహారం నిబంధనలు కూడా మార్చేసింది. బీమా మిత్రలను తొలగించి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పథకాన్ని అమలు చేసింది. క్లెయిముల పరిష్కారం కూడా నత్తనడ కన సాగింది. కేవలం బియ్యం కార్డుదారులను మాత్రమే ఈ పథకానికి అర్హులుగా నిర్ణయించింది.. అంతే కాకుండా 18 నుంచి 50 ఏళ్ల వయసు వారు సహజ మరణం చెందితే అప్పటి వరకు ఇస్తున్న రూ.2లక్షల పరిహారాన్ని రూ.1లక్షకు కుదించింది. 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసు వారు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం సంభవిస్తే రూ.5లక్షల పరిహా రం అందించే పద్ధతి పెట్టింది. అయితే జిల్లాలో వైసీపీ హయాం లో చేసిన క్లెయిములకు సంబంధించి ఇప్పటికీ సుమారు 250 మందికి రూ.2కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉందని సమాచారం.



● త్వరలో పునరుద్ధరణ?

ప్రస్తుత కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని పున రుద్ధరించే ఆలోచనలో ఉంది. గతంలో కంటే మరింత మెరుగైన ప్రయోజనాలతో సహజ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు చెల్లించేలా పథకాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే దీనిని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అమలు చేయాలా, పేదరిక నిర్మూలన సొసైటీ ద్వారా అమలు చేయాలా..? అనే అంశంపై చర్చలు జరుపుతోందని, త్వరలోనే విధివిధానాలను ఖరారు చేసి పథకాన్ని పట్టాలెక్కించేలా చర్యలు తీసుకుంటోందని తెలిసింది. అయితే, గత ప్రభుత్వంలో పెండింగ్ క్లెయిములు చెల్లిస్తుందా?, ఆ తర్వాత మరణించిన వారి కుటుంబాలకు పథకాన్ని వర్తింపజేస్తుందా అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

● నిలిచిపోయిన పథకం

గతేడాది ఎన్నికలప్పటి నుంచి పేదల బీమా పథకం అమలు కావడం లేదు. దీనివల్ల రెక్కాడితే గానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు, కుల వృత్తులు చేసుకునే పేదలు, హమాలీలు, చిన్న, సన్నకారు రైతులు, కళాకారులు, వీధి వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మి కులు.. ఇలా పేద కుటుంబాలు తీవ్రం గా ఇబ్బందులు పడుతున్నాయి. అయితే మరణించిన వారి వివరాలను మాత్రం యంత్రాంగం నమోదు చేస్తు న్నట్లు తెలిసింది. ఆ విధంగా సుమారు 10 మాసాలుగా జిల్లాలో రమారమి 700 మంది పేర్లు బీమా కోసం నమోదు చేసినట్లు సమాచారం.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం

● లోపల పొదుపు మహిళలు.. బయట తాళం వేసుకుని వెళ్లిన సిబ్బంది

పొదలకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యంతో నలుగురు పొదుపు మహిళలు గంటపాటు ఆందోళనకు గురైన ఘటన శనివారం పొదలకూరులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పొదలకూరు పట్టణంలోని బిట్-2 సచివాలయంలో మిద్దెపైన గదిలో ఆడిట్‌లో భాగంగా నలుగురు పొదుపు మహిళలు ఉన్నారు. కింద భాగంలో విధుల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులు విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ముందు పై అంతస్థులో ఎవరైనా ఉన్నారా లేదా అని చూడకుండా సచివాలయానికి తాళాలు వేసుకుని వెళ్లారు. కొద్దిసేపటికి పైన ఉన్న నలుగురు మహిళలు కిందకి రాగా సచివాలయానికి తాళం వేసి ఉంది. ఈ క్రమంలో ఎంతసేపు తలుపులు తట్టినా ప్రయోజనం లేకపోయింది. దీంతో గంటపాటు ఆ నలుగురు పొదుపు మహిళలు ఆందోళనకు గురయ్యారు. వాళ్ల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా వారు సచివా లయం వద్దకు వచ్చి ఉద్యోగులకు సమాచారం ఇచ్చి పడిగాపులు కాశారు. ఆ సమయంలో సచివాలయ ఉద్యోగులు తాళాలతో అక్కడికి వస్తే పొదుపు మహిళల బంధువులు, కుటుంబ సభ్యులు మండిపడుతారని గ్రహించి పంచాయతీ ప్లంబర్ ప్రసాద్‌ని పిలిపించి అతని వద్ద తాళాలు పంపించారు. అతను తాళాలు తియ్యడంతో ఊపిరిపీల్చుకున్న ఆ మహిళలు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



సచివాలయం లోపల ఉన్న పొదుపు మహిళలు

ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

● డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి ఒకటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఉదయభాస్కర్‌రావు తెలిపారు. నెల్లూరు నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంట్ అధికారులు, కస్టోడియన్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు కనీస అవసరాలతోపాటు అన్నీ సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్షల ప్రారంభం నాటికి పూర్తిస్థాయిలో నివేదికలు ఎప్పటికప్పుడు తనకు అందచేయాలని తెలిపారు. ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరం 28,176 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 25,024 మంది హాజరవుతున్నారన్నారు. 79 కేంద్రాల్లో ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్‌లతోపాటు జిల్లా పరీక్షల కమిటీ నిరంతర పర్యవేక్షణతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షల సమాచారం, సమస్యలు తెలియచేసేందుకు ఇంటర్‌బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి ,0861-2320312 నెంబరును అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో ఎవరైనాసరే ఈ నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియచేయవచ్చని తెలిపారు. సమావేశంలో డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, జిల్లా బల్క్ ఇన్‌చార్జి రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

క్వింటంకు రూ. 500 సబ్సిడీ ఇవ్వాలి ● కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలి

● కలెక్టరేట్ వద్ద వ్యవసాయ సంఘాల నిరసన

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించాలని వ్యవసాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంయుక్తంగా నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు మాట్లాడారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరికోతలు జరుగుతున్నాయ న్నారు. అయితే అధికారులు ప్రకటించిన 523 రైతు సేవాకేంద్రాలు పరిధిలో ఇంకా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళారులు, మిల్లర్లు ఏకమై రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ మిల్లర్లతో పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాకు రూ. 500 సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఈకేవైసీ పూర్తి చేయని రైతుల నుంచి కూడా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు టీవీవీ ప్రసాద్, పుల్లయ్య, వెంగయ్య మాట్లాడుతూ కౌలు రైతులు, పండించిన ధాన్యాన్ని అమ్ముకోవటానికి నిబంధనలు సడలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైతులే మిల్లులకు ధాన్యం తరలించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. తూకాలలో మోసాలను అరికట్టాలన్నారు. తేమ మిషన్లు, గోతాలు సమకూర్చి, తగినంత సిబ్బందిని కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వ్యవసాయ సంఘాల నాయకులు

● మంత్రి నాదెండ్లకు వినతిపత్రం

పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌కు కలెక్టరేట్‌లో రైతు నాయకులు వినతి పత్రం సమర్పించారు. రైతుల సమస్యలను పరిష్కరి స్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రితోపాటు దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా పాల్గొన్నారు.

...ఆ నగదును జీతాల్లో రికవరీ చేయండి!

● నెల్లూరు కమిషనర్ ఆదేశాలు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 22 (ఆం ధ్రజ్యోతి) : పురపాలక శాఖ అందిస్తున్న వివిధ సేవలకుగాను ప్రజల నుంచి వసూలు చేసిన నగదును సచివాలయ ఉద్యోగులు కార్పొరేషన్ ఖజానాలో జమ చేయకపోవడంపై నగర కమిషనర్ సూర్యతేజ మండిపడ్డారు. ఆ మొత్తాన్ని సదరు ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేయాలని శనివారం ఆదేశాలిచ్చారు. నెల్లూరు నగరంలోని 44 సచివాలయాల్లోని ఉద్యోగులు ప్రజల నుంచి రశీదుల ద్వారా రూ. 5.73 లక్షలు వసూలు చేసినట్లు గుర్తించారు. ఆ మొత్తం నగర పాలక సంస్థకు జమ కాకపోవడంతో ఆ ఉద్యోగుల జీతాల నుంచి రాబట్టాలని ఉత్తర్వులిచ్చారు.

నేడు గ్రూప్-2 పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

మెయిన్స్ పరీక్షలు యథాతథంగా జరుగుతాయని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. 15 నిమిషాల ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, దాన్ని ఎవరూ నమ్మవద్దని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన్ను బీజేపీ నాయకులు శనివారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గెస్ట్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు లేక, నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక రైలు మిల్లర్లు అడిగిన ధరకే ధాన్యం అమ్మాల్సిన పరిస్థితులు రైతులకు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్ ఇతర నేతలు నారాయణ, హర్షవర్ధన్, ఎన్‌కె యశ్వంత్‌సింగ్, గడ్డం విజయ్‌కుమార్, ఆల్తూరు హరి ఉన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన బీజేపీ నేతలు

తెనాలి రామకృష్ణ దేశం గర్వించదగ్గ కవి : గంగిశెట్టి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రామకృష్ణుడు తెలుగు కవే అయినప్పటికీ దక్షిణ భారతదేశమంతటా ఆయన కథలు ప్రచారంలో ఉన్నాయి, ఉత్తరాదిలో సైతం ప్రసిద్ధి పొందాయని బాలసాహితీ భూషణ్ డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ పేర్కొన్నారు. చేతన - సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం టౌనుహాల్ ఆవరణలోని వర్ధమాన సమాజం హాల్‌లో తెనాలి రామలింగ కవి సాహిత్య సభ జరిగింది. రామలింగ కవి వ్యక్తిత్వం, సాహిత్యంపై శివకుమార్ ప్రసంగించారు. ఎంతటి వారినైనా తన ప్రతిభా పాండిత్యాలతో రామలింగడు చిత్తు చేయగలడన్నారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో బీర్బల్‌లాగా దక్షిణాదిలో రామలింగ కవి ప్రసిద్ధుడన్నారు. మాతృభాషా ఉద్యమ సమితి నేత చెలంచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సాహిత్యం మనసును వికసింపచేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని చేతన సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం నిర్వహించారు. నలుబోలు బలరామయ్యనాయుడు, ఏ జయప్రకాష్, జీ సుభద్రాదేవి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, సుబ్బారాయుడు, దుర్గా మురళీకృష్ణ, జనార్దన్, రమేష్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.



శివకుమార్‌ను సత్కరిస్తున్న సాహిత్య సభ నిర్వాహకులు

రాజరాజేశ్వరి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం హరినారాయణశర్మ కుటుంబం సందర్శించింది. అమ్మవారికి విశేష పూజలు చేశారు. అర్చకులు, వేదపండితులు తీర్థ ప్రసాదాలిచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



పది పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, పక్కన జిల్లా అధికారులు

కావలి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ రవీంద్రనాధ్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక శాంతినగర్‌లోని పాఠశాల సమావేశ మందిరంలో పది పరీక్షలకు సంబంధించి ఎంఈవోలు, సూపరిటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, సెంటర్ కస్టోడియన్లు, రూట్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి బాలాజీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పది పరీక్షల విషయంలో గతంలో అనేక తప్పిదాలు జరిగాయని ఇకపై అలా జరిగేదానికి ఏమాత్రం అవకాశం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి చిన్న పొరపాటు జరిగినా ఇన్విజిలేటర్‌దే పూర్తి భాద్యత అన్నారు. అనంతరం డీఈవో బాలాజీరావు మాట్లాడారు. మార్చి 3 నుంచి 15వరకు ఓపెన్ ఇంటర్ 17నుంచి 31వరకు, పది పరీక్షలు 17నుంచి 28వరకు ఓపెన్ స్కూర్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మొత్తం 33,443మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని జిల్లావ్యాప్తంగా 174 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 9స్కాడ్లు పర్యవేక్షిస్తాయన్నారు. సమావేశంలో ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయం ఏఎన్ఎంల మెరిట్ జాబితా

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయం ఏఎన్ఎంల పదోన్నతికి సంబంధించి ఫైనల్ మెరిట్ జాబితాను అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. sps nellore.ap.gov.in/notice/recrutment అనే వెబ్‌సైట్‌ను చూడవచ్చని ఆమె తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

బలహీనవర్గాల అభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యం

- కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి
- గృహనిర్మాణ అధికారులతో ప్రగతిపై సమీక్ష
- 12 మందికి ఎస్సీ కార్పొరేషన్ రుణాల చెక్కు అందజేత

కావలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితోనే సాధ్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజనపథకం ద్వారా పీఎం అజయ్- ఉన్నతి రుణాల పంపిణీ కార్యక్రమం శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజుకుమారితో కలిసి నియోజకవర్గంలోని 12మంది లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.22,05,000లక్షల చెక్కులను అందజేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాక ముందే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. రామాయపట్నం పోర్ట్, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి విమానశ్రయాలను త్వరలోనే పూర్తి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్లు నిర్మించటంతో పాటు ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా సుమారు రూ.కోటి వరకు లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం అందజేశామన్నారు. బీసీ, కాపు, వైశ్య పలు అనుబంధ ఉపకులాలకు చెందిన వారికి పార్టీలకతీతంగా త్వరలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు ఆవుల రామకృష్ణ, నారయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చుతాం

ప్రతిపేదవాడి సొంతింటి కల నెరవేర్చటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అందుకు అధికా రులు సహకరించాలని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆర్డీవో వంశీక్రిష్ణతో కలిసి గృహనిర్మాణ ప్రగతిపై నియోజకవర్గ అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సొంతిల్లు కట్టించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశ్యమని అందుకు గృహనిర్మాణ ప్రగతి పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. పార్టీలకతీతంగా ప్రతి పేదవాడిని గుర్తించి వారికి ఇళ్ల మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్ష పెంచి రూ.2.5లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అదనంగా ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీలకు రూ.50వేలు, కులవృత్తుల వారికి రూ.50వేలు ఆయా కార్పొరేషన్ల ద్వారా అందజేస్తామన్నారు. అవి కాకుండా బ్యాంకర్లు వడ్డీ లేని రుణాలు అందజేస్తామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. కావలిలో అవినీతి రహితపాలన అందించటమే తన లక్ష్యం అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఎల్‌డీవో విజయకుమార్, హౌసింగ్ ఈఈ మాధవరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, తహసీల్దార్లు, ఎమ్పీడీవోలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్నఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తదితరులు

న్యూస్ బాక్స్

ప్రైవేట్ వైద్యశాల తనిఖీ


సర్టిఫికెట్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి

కలిగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నూర్ క్లినిక్‌ను శనివారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి సందర్శించారు. క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న నిర్వాహకుడు మొగల్ ఆరీఫ్‌ను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు తనిఖీ చేపట్టామన్నారు. అనంతనం ఏపీ మెడికల్ కౌన్సిల్ నందు రిజిష్ట్రేషన్ చేసుకున్న సర్టిఫికెట్‌ను పరిశీలించారు. వైద్యసేవల అనుమతుల కోసం జిల్లా వైద్యఆరోగ్య శాఖను సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఎస్‌హెచ్‌ఓ సాయిలక్ష్మి ఉన్నారు.

జ్ఞానజ్యోతిపై శిక్షణ


పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):స్థానిక హైస్కూల్‌లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వ హించారు. కార్యక్రమంలో భాగంగా సృజనాత్మకత, సామాజిక బావోద్వేగ అభివృద్ధికి సంబంధించి ఇద్దరు చిన్నారుల పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని, గర్భవతులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం శైలజ, డీఆర్‌పీలు జనార్దన్, జాన్సన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమం


తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న ఓ విద్యార్థి

కందుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):స్థానిక కోటారెడ్డినగర్‌లోని శ్రీచైతన్య హైస్కూల్‌లో శనివారం ఫ్యామిలీ గ్లోరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లిదండ్రులను నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. బిడ్డల ఆప్యాయతకు భావోద్వేగానికిలోనై తల్లిదండ్రులు గుండెలకు హత్తుకున్న సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకడమిక్ డీన్ బ్రహ్మాయ్య, ఇన్‌చార్జి శివయ్య, ఆర్‌ఐ అనిల్‌కుమార్, శ్రీనివాసులు, ఏవో సురేష్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

అల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు తమ భూములకు సంబంధించి ప్రభుత్వ లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందడంతో పాటు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధరను కల్పించేలా ఏర్పాటు చేసిందన్నారు. ఈ-కేవైసీతోపాటు రైతు రిజిస్ట్రేషన్ నెంబరును ఖచ్చితంగా పొందాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

ఘటిక సిద్దేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభం

సీతారామపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొలంగారిపల్లి గ్రామ సమీపంలో కొమ్మిశెట్టి సుబ్బారావు, సుభరత్నమ్మ దంపతుల సహకారంతో నిర్మించిన సిద్దేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వార పారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలనంతరం ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో22వాటర్ ప్లాంట్లను త్వరలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. అనంతరం పలు గ్రామాల సమస్య లను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించారు. కార్య క్రమంలో మాజీ జడ్పీచైర్మన్ పొన్నుబోయిన చెంచలబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, మాజీ జడ్పిటిసి కలివెట జ్యోతి, ఆదినారాయణ, ఎడమ ప్రవీణ్ కుమార్, వెంకటసుబ్బయ్య, తమిశెట్టి రమణయ్య పాల్గొన్నారు.


రిబ్బన్ కట్ చేసి ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న డాక్టర్ నాగభార్గవి

కావలిటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి) పట్టణ రాజావీదిలోని ఓవెల్ మినర్వా ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మెగా సైన్స్ ఎక్స్‌పో నిర్వహించగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ శివయ్య పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా డాక్టర్ కర్నాటి రోహిత్, డాక్టర్ నాగభా ర్గవి దంపతులు పాల్గొని ఎగ్జిబిట్స్ తిలకించి విద్యార్థులను అభినందిం చారు. వారు మాట్లాడుతూ మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి వుందని విద్యార్థులు చిన్నతనంనుంచే శాస్త్రీయ దృక్పదం అలవర్చుకోవాలన్నారు. వివిధ వేషాధారణలో అలరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఏజీఎం జయదేవ్, డీజీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

జేవీవీ వక్తృత్వ, పాటల పోటీలు

జాతీయ సైన్స్ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జేవీవీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పోటీల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ప్రముఖ గాయకులు రామచంద్రయ్య, ఉమాశర్మ, విశ్రాంత ఉపాధ్యాయులు జాఫర్‌ఖాన్, శారద, వెంకయ్య, చంద్రశేఖర్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందిం చుటకు, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కలిసి పనిచేద్దాం, హరిత వనాలు పెంచడంలో నేను ముందుంటా అనే అంశాలపై వక్తృత్వ పోటీలు, సందేశాత్మక పాటల పోటీలు జరిగాయి.

సాయిపేటలో కుక్కలకు యాంటీరేబిస్ వ్యాక్సిన్

కొండాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):సాయిపేట పంచాయతీలోని కొత్తపాలెం, మెయిన్ విలేజి, బీసీ, ఎస్టీ కాలనీల్లోని వీధి కుక్కలకు బ్లూ క్రాస్ సొసైటీ నెల్లూరు వారి సహకారంతో శని వారం వైద్యాధికారి మధు యాం టీరేబీస్ వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుక్కలకు సోకే ప్రాణాంతకమైన జునోటిక్ వ్యాధి ప్రబలకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జంతువుల సంక్షేమం, ఎస్‌పీసీఏ చట్టం, రేబీస్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్య దర్శి ప్రదీప్, సర్పంచ్ కోటేశ్వరమ్మ, గ్రామస్థులు చిమ్మిలి శ్రీదేవి, డేగ శ్రీనివాసులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కుక్కకు ఇంజక్షన్ వేస్తున్న వైద్యాధికారి మధు తదితరులు

ఉలవపాడులో వైద్య శిబిరం

ఉలవపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పాస్టర్ల సంఘం సభ్యులు శనివారం మండలకేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సరయూస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్, డయాబె టిక్, ఎమర్జెన్సీ వైద్య నిపుణులు రాజేష్, గర్భ కోశ వ్యాధి నిపుణులు సుస్మితలు 100మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఈసీజీ, షుగర్, ప్రెగ్నెన్సీ డాప్లర్ స్కాన్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందచేశారు. అనంతరం పాస్టర్లు వైద్య దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నకుమార్, కమలాకర్, జోసెఫ్ కుమార్ పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గడ్డంవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం గండిపాళెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరు: మండలంలోని నందిపాడు కేజీబీవీలోని విద్యార్థులకు దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యఆరోగ్య సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకురాలు బీబీజాన్, ఆరోగ్య పర్యవేక్షకుడు ఖాజామొహిద్దీన్, ప్రిన్సిపాల్ అంజనీదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


చదలవాడ జేమ్స్ (ఫైల్)

కందుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో శనివారం కందుకూరు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చదలవాడ జేమ్స్ (57) గుడ్లూరు నుంచి కందుకూరుకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నాడు. ఈ సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో తోటి ప్రయాణికులు గుర్తించి అతన్ని తక్షణమే కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతన్ని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలి ఎంఈవో-2 శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలు తయారుచేసిన బోధనో పకరణాలను పరిశీలించారు. చిన్నారులను బాధ్య తగా చూసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకేశవులు, రిసోర్సుపర్సన్‌లు ఫణికుమార్, సుబ్బారెడ్డి, సారధి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, అధ్యాపకులు ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథం అధికారి రమేష్, అధ్యాపకులు గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, సునీత, ఏవో కమలప్రియ, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల జలాల సరఫరాపై సర్వే

సీతారామపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలానికి సోమశిల జలాలను అందించేందుకు సమర్థ్ కంపెనీ బృంద సభ్యులు సీతారామపురం గ్రామ పంచాయతీలో శనివారం సర్వే చేపట్టారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీనిస్సీ మాట్లాడుతూ ప్రభుత్వం సోమశిల జలాల సరఫరా కోసం సర్వే ప్రక్రియను ప్రైవేట్ కంపెనీకి అనుమతి ఇచ్చిందని తెలిపారు. ట్రంక్‌లైన్ ఏర్పాట్లతో మండలంలోని అన్ని గ్రామాలకు సోమశిల జలాలు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు.

రోజుకి రూ.300 ఉపాధి కూలి

ఉలవపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్ర జ్యోతి): ప్రతిరోజు రూ.300 వచ్చే విధంగా పనిచేయాలని కందుకూరు ఏపీడీ బాబురావు ఉపాధి కూలీలకు సూచించారు. శనివారం ఆయన బద్ధిపూడిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజుకి 4గంటలు తగ్గకుండా చేయిస్తే అప్పుడే పూర్తి స్థాయిలో కూలీ గిట్టుబాటు అవుతుందని, అందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

మొగిలిచెర్లకు ప్రత్యేక బస్సులు

● సంగమేశ్వరానికి 5..

లింగసముద్రం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి పండుగకు మొగిలిచెర్ల శ్రీదత్తాత్రేస్వామి ఆలయానికి కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి 30ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు శనివారం డిపో సహాయ మేనేజరు శ్యాంప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన లింగసముద్రం, మొగిలిచెర్లలోని ఆలయాల సమీపంలోని బస్సులు నిలుపు స్థలాలను పరిశీలించారు. అనంతరం మొగిలి చెర్లలోని దత్తాత్రేయస్వామి ధర్మకర్త పవని ప్రసాద్, లింగసముద్రం తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నిర్వాహకులు తిరుపతయ్యలతో వసతులపై చర్చించారు. ఆయన వెంట సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీరు అందిస్తాం

బిట్రగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ బృందం సభ్యులు శనివారం సోమేశ్వరపురం మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో సర్వే నిర్వహించారు. వారి వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు. మండలంలో మూడు డీజీపీఎస్ బృంద సభ్యులు సర్వేలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు కే.వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున, సుబ్బారెడ్డి ఉన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూసారం పెంచేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయక అధికారిణి మారుతీదేవి తెలిపారు. శనివారరం బోగోలు ఆర్‌బీకేలో పోషకాహర ధాన్యాలు, కోత అనంతరం రైతుల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన సదస్సు పాల్గొని మాటాడారు. మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మీ, వ్యవసాయ పరిశోధన స్థానం నెల్లూరు శాస్త్రవేత ఓబయ్య, జిల్లా వనరుల కేంద్రం ఏవో గీతాకుమారి పాల్గొని రైతులకు పంటల సాగుపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బోగోలు ఇన్‌చాచార్జి మంతాలవెంకయ్య, నీటి సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, శీనయ్య ఉన్నారు.

ఖాదర్‌వలి గంధోత్సవం

బిట్రగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేటపంచాయతీ కొత్తూరులో ఖాదర్‌వలి దర్గాలో గంధ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పఠాన్ నజీర్‌ఖాన్ ఇంటి వద్ద నుంచి గంధం, జెండాలను మేళతాలతో దర్గా వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 14మంది లబ్ధిదారులకు రూ.9 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అందజేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ సీఎం చంద్రబాబు పేదలను ఆదుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రఫి, సీహెచ్ కొండయ్య, నార్నే రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ ధర్నా


సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు డిమాండు చేశారు. శనివారం ఈ విషయంపై సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు. జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పక్కన పెట్టి రైతులకు గిట్టుబాటుధర కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరును తప్పుపట్టారు. పెట్టుబడులు అధికమై గిట్టబా టుధర రాక, అప్పులపాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వరి, పొగాకు, మిర్చి, శనగ పంటలను అధికంగా సాగు చేస్తారని తెలిపారు. పొగాకు పంటకు క్వింటాకు సగటు ధర రూ.35వేలు, మిర్చి క్వింటాకు రూ.25వేలు, వరి ధాన్యానికి క్వింటాకు రూ.4500 మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ శ్రీపూజకు అందజేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా స హాయ కార్యదర్శి మాదాల రమణయ్య, జిల్లా నాయకులు ఎస్.గౌస్, జీవీబీ కుమార్, కొట్టే వెంకయ్య, దామా కృష్ణయ్య, వర్ధినేని సిద్దయ్య, దాసరి రామూర్తి, డీఎం.రాయుడు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

● సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కావలి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):ఆప్కాస్ రద్దును ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు శనివారం నాలుగో డివిజన్ మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పజెప్పాలనే ఆలోచనలో ఉన్నారని, ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.కార్మికుల ఎన్నికల హామీలు విస్మరించారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కారానికి దశలవారీగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, తురకా శీనయ్య, బాబు, రమేష్, రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శనివారం ప్రిన్సిపల్ షేక్ ఖాదర్‌భాషా తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆధార్, ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి ధ్రువీకరణ పత్రంతో ఈనెల 24 నుంచి మార్చి నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

● ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): వీరేపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి చేరేందుకు ఈనెల 25 నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి-2 ఎంవీ రమణయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

భీమేశ్వరుడి వైభవంగా శేషవాహన సేవ


అలంకరణలో కామాక్షిదేవి, భీమేశ్వరస్వామి

సంగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వంగల్లులో భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి స్వామివారికి శేషవాహనసేవ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా శ్రీ కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూలంగిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

కావలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్వోదయసేవా సమితి సభ్యులు శనివారం స్థానిక సమితి కార్యాలయంలో 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేల విలువచేసే నిత్యావసరాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి మాట్లాడారు. విద్యాదాత డీఆర్ జ్ఞాపకార్థం ప్రతి నెలా ఆయన కుమారులు వినయ్‌కుమార్ రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతి రెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, జేబీ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు భాగ్యలక్ష్మీ, మౌనిక గ్రేసి పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరణ


చెత్త సేకరిస్తున్న క్లాప్‌మిత్రలు

ఉదయగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):శకునాలపల్లి పంచాయతీలో శనివారం క్లాప్ మిత్రలు ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరించారు. ఇన్‌చార్జి ఈవోపీ ఆర్డీ షేక్ కరీముల్లా మాట్లాడుతూ గ్రా మాల్లో ప్రజలు అందజేసిన తడి, పొ డి చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిం చడం జరుగుతుందన్నారు.

●దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీలో క్లాప్‌మిత్రలు ఇంటింటికీ తి రిగి తడి, పొడి చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ఈవోపీ ఆర్డీ మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రజలు ఇంటివద్దకు వచ్చే సిబ్బందికి, తడి, పొడి చెత్త అందజే యాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి షేక్ నజీ ముల్లా పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

కావలి రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దచెరువు ఒడ్డున వెలసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు మాధవరపు మాధవదాసు కుమారుడు మాల్యాద్రి స్వామి మాట్లాడారు. ఈ నెల 12న జరిగిన స్వామివారి కళ్యాణ మహోత్సవం అనంతరం ఈ 16 రోజుల పండుగ వేడుకలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. జక్కంపూడి మోహన్‌రావు, సుగుణమ్మ దంపతులు అన్నసంతర్పణ చేశారు.